నిజం మా నైజం...!

RNI NO:TELTEL/2022/81794

# వాస్తవ తెలంగాణ

VASTHAVA TELANGANA DAILY

తెలుగు దినపత్రిక

PUBLISHED FROM: TELANGANA & ANDHRAPRADESH

www.vasthavatelangana.com | ఎడిటర్ : చింతల రామకృష్ణ | సంపుటి: 4 | సంచిక: 302 | బుధవారం,25 మార్చ్ 2026 | పేజీలు - 8 | వెల : 3/-









## ..ఆ విద్యార్థులను ఆదుకోవాలి

### ఓవర్సీస్ విద్యా నిధులు రిలీజ్ చేయాలి

నిధులు విడుదలకాక విదేశాల్లో విద్యార్థుల అవస్థలు
వారి భవిష్యత్ కాపాడాలని ప్రభుత్వానికి సూచన
అసెంబ్లీలో ప్రస్తావనకు తెచ్చిన కేటీఆర్

3

బీఆర్ఎస్ ప్రభుత్వం 'ఓవర్సీస్ విద్యా నిధి' పథకం ద్వారా దళిత, గిరిజన, బీసీ విద్యార్థులకు సాయం అందించిందని.. ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఆ పథకం నీరుగారిపోయిందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. అసెంబ్లీలో మంగళవారం ఈ అంశంపై మాట్లాడారు

## అధ్వానంగా రహదారులు

### హైదరాబాద్ రోడ్లపై అసెంబ్లీలో రచ్చ

ప్రభుత్వాన్ని నిలదీసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు
కనీసం గుంతలు పూడ్చే నాధుడు లేడని విమర్శలు

3



హైదరాబాద్‌లో రోడ్ల దుస్థితిపై నగర పరిధిలోని ఎమ్మెల్యేలు మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత హైదరాబాద్ అభివృద్ధి కుంటుపడిందని.. రోడ్లు అధ్వానంగా తయారయ్యాయని విమర్శించారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా హైదరాబాద్ ఎమ్మెల్యేలు మాట్లాడుతూ.. నగరంలో రోడ్లను పట్టించుకునే నాధుడే కరవయ్యాడని అన్నారు. బీఆర్ఎస్ హయాంలో హైదరాబాద్ సేఫెస్ట్ ప్లేస్‌గా ఉండేదని మాజీ మంత్రి, సనత్ నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్ యాదవ్ అసెంబ్లీలో ప్రస్తావనకు తీసుకొచ్చారు. **వాస్తవ తెలంగాణ:**




# నియోజకవర్గాల.. పునర్విభజన!

## 816కు పెరగనున్న లోక్‌సభ స్థానాలు

ఈ సెషన్‌లోనే పునర్విభజన బిల్లు.. వేగంగా అడుగులు వేస్తున్న కేంద్రం
వామపక్ష, ఎన్డీఏ కూటమి పార్టీలతో చర్చలు..కాంగ్రెస్‌తో అమిత్ షా భేటీ!
2011 జనాభా ప్రతిపాదికన 50శాతం సీట్లు పెంపు.. 816కు లోక్‌సభ సీట్లు
అసెంబ్లీల సీట్లు 4,123 నుంచి 6,185 పెరుగుదల
లోక్‌సభ, అసెంబ్లీలో 33% మహిళలకు రిజర్వేషన్

5

దేశ రాజకీయాల్లో కీలక మార్పులకు దారితీసే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీ స్థానాలను 50శాతం పెంచాలని నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన బిల్లును ఈ పార్లమెంటు సమావేశాల్లోనే ప్రవేశపెట్టడానికి సిద్ధమైంది. దీని ప్రకారం.. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాలు 816కి పెరగనున్నాయి. ఇదే విధంగా దేశ వ్యాప్తంగా అసెంబ్లీ స్థానాలు కూడా 4,123 నుంచి 6,185కు పెరుగుతాయి. అటు లోక్ సభలోనూ, ఇటు అసెంబ్లీలోనూ 33% సీట్లు మహిళల కోసం రిజర్వ్ చేస్తారు. ఈ ప్రతిపాదనలో భాగంగా తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలు గణనీయంగా పెరగనున్నాయి. తెలంగాణలో ప్రస్తుతం ఉన్న 17 లోక్‌సభ స్థానాలు 26కు.. అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 179కి పెరగనున్నాయి. అదే విధంగా ఏపీలో లోక్‌సభ స్థానాలు 25 నుంచి 38కి.. అసెంబ్లీ స్థానాలు 175 నుంచి 263కు చేరే అవకాశం ఉంటుంది. **వాస్తవ తెలంగాణ:**

# ఎస్సీ ఎస్టీ వర్గాలను నిండా ముంచిన కాంగ్రెస్ పార్టీ



వేల్పూర్, **వాస్తవ తెలంగాణ:** వేల్పూర్ మండలంలోని ఎమ్మెల్యే నివాసంలో మంగళవారం మీడియా సమావేశం ఏర్పాటు చేసి మాట్లాడిన ఎస్సీ, ఎస్టీ నాయకులు పసుల ముత్తేన్న,నీరడి భాగ్య, మైలారం సుధాకర్, శర్మ నాయక్,తిరుపతి నాయక్, రాజన్న,గంధం మహిపాల్, మాలవత్ ప్రకాష్, గడలా ప్రసాద్, తుక్కజీ నాయక్, పర్స నవీన్ ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ మాయ మాటలు చెప్పి అధికారంలోకి వచ్చి తెలంగాణ సబ్బండ వర్గాలను మోసం చేసింది.మూడు బడ్జెట్లలో వేల కోట్ల రూపాయలు పెట్టినామని చెప్పి అత్యంత స్వల్పంగా ఖర్చు చేసింది. సబ్ ప్లాన్ అమలును పక్కన పెట్టింది.అన్నింటికంటే దారుణంగా ఈ సంవత్సరం బడ్జెట్లో దేశంలో ఎక్కడా లేని విధంగా 70% నిధులను ఎస్సీ, ఎస్టీలకు కేటాయించే నిధుల్లోనూ కోత పెట్టింది.70% నిధుల కోత అంటే ఎస్సీ, ఎస్టీ జీవితాల పైన కాంగ్రెస్ పార్టీ చేస్తున్న దాడి అని చెప్పవచ్చు. ప్రతి ఏటా ప్రతి వర్గానికి నిధులను పెంచిన ప్రభుత్వాలని చూసాము కానీ, మొదటిసారి 37 వేల కోట్ల రూపాయల భారీ నిధులను కోత విధించిన దుర్మార్గపు కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణలో ఉన్నది.గత ఏడాది సుమారు 57 వేల కోట్ల రూపాయలు కేటాయించినామని చెప్పుకున్న ప్రభుత్వం, ఈసారి గంప గుత్తగా కేవలం 19 వేల కోట్లు మాత్రమే కేటాయించి 37 వేల కోట్ల రూపాయలను కోత పెట్టింది.ఇది సామాజిక న్యాయం ఏమాత్రం కాదు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు వారి అభివృద్ధిని, భవిష్యత్తును సమాధి చేయడమే.ఇక నిధుల కోత మాత్రమే కాదు, ఎన్నికల ముందు ఇచ్చిన ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ అమలులోనూ ఒక్క అడుగు కూడా ముందుకు వేయలేదు.మల్లికార్జున ఖర్గే ఇచ్చిన ఈ చేవెళ్ల డిక్లరేషన్ ఎస్సీ, ఎస్టీలను మూడు సంవత్సరాలలో అడుగడుగునా మోసం చేస్తూనే ఉన్నదని అన్నారు.అంబేద్కర్ అభయ హస్తం కింద కేసీఆర్ ఇస్తున్న10 లక్షలు కాదు,12 లక్షలు ఇస్తామని చెప్పి ఇప్పటిదాకా ఒక్క వ్యక్తికి కూడా ఈ పథకాన్ని అమలు చేయలేదని అన్నారు.దళిత బంధు పథకంలో ఉన్న10 లక్షలను పక్కన పెట్టింది,12 లక్షల రూపాయల ఊసే ఎత్తడం లేదని అవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ కాంట్రాక్టుల్లో ఎస్సీలకు 18%, ఎస్టీలకు 12% రిజర్వేషన్లు అని చెప్పి కనీసం దాని గురించి మాట్లాడలేదని ప్రశ్నించారు. పోడు పట్టాల పంపిణీ చేస్తామని చెప్పి ఇప్పటిదాకా దాని గురించి పట్టించుకోవడం లేదని ఆరోపించారు.సమ్మక్క-సారక్క గిరిజన గ్రామీణ అభివృద్ధి పథకాన్ని ప్రవేశపెట్టి తద్వారా ప్రతి గూడెం, తాండా, గ్రామ పంచాయితీలకు ప్రతి ఏటా 25 లక్షలు కేటాయిస్తామని చెప్పి ఇప్పటిదాకా ఒక్క గ్రామ పంచాయితీకి 25 పైసలు కూడా ఇవ్వలేదని తెలిపారు.మాల, మాదిగ ఇతర ఎస్సీ ఉపకులాలకు కొత్త కార్పొరేషన్ల ఏర్పాటు, ప్రతి కార్పొరేషన్ కి 750 కోట్ల రూపాయల నిధుల కేటాయింపు అని చెప్పి మోసం చేసిందని అన్నారు.

**ఎస్సీ,ఎస్టీ విద్యార్థులకు విద్యాజ్యోతిల పథకం**

10వ తరగతి పాస్ అయితే 10,000/ ఇంటర్ పాస్15,000/- డిగ్రీ పూర్తి 25,000/-పీజీ, 1,00,000/-ఎంఫిల్, పీహెచ్‌డి 5,00,000/ అందజేస్తామని చెప్పింది.కానీ ఒక్క విద్యార్థికి నయా పైసా ఇప్పటిదాకా చెల్లించలేదని ఇంత దారుణంగా ఎస్సీ, ఎస్టీ వర్గాలను మోసం చేసిన ప్రభుత్వం దేశ చరిత్రలో లేదని చెప్పారు. కాంగ్రెస్ పార్టీకి తగిన బుద్ధి చెప్పే రోజులు దగ్గరలోనే ఉన్నాయి అని, ఎస్సీ,ఎస్టీ బిడ్డలు ఈ అన్యాయాన్ని తిప్పికొడతారని హెచ్చరిస్తున్నారు.ఈ సమావేశంలో తాళ్ళ రాజన్న, జిన్నా శోభన్,సౌడ రమేష్,మోహన్ దాస్,లక్కం నర్సయ్య, కళ్యాణ్,సాయన్న తదితరులు పాల్గొన్నారు..

# వరుసగా ఐదవసారి జెడి (యు) అధ్యక్షుడిగా నితీష్ కుమార్



పాట్నా : **వాస్తవ తెలంగాణ:** బీహార్ ముఖ్యమంత్రి నితీష్ కుమార్ జెడి(యు) అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. జెడి(యు) అధ్యక్షుడిగా నితీష్ కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికవడం వరుసగా ఇది ఐదవసారి. ఈ వివరాలను రాజ్యసభ మాజీ ఎంపి, రిటర్నింగ్ అధికారి అనిల్ ప్రసాద్ హెగ్డే మంగళవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీ కేంద్ర కార్యాలయంలో వర్కింగ్ ప్రెసిడెంట్ సంజయ్ కుమార్ ఝా, కేంద్ర మంత్రి రాజీవ్ రంజన్‌సింగ్ అలియాస్ లలన్ సింగ్‌లు నితీష్‌కు ఎన్నిక ధ్రువ పత్రాన్ని అందించారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో నితీష్ కుమార్ రాజ్యసభకు ఎన్నికైన సంగతి తెలిసిందే.

# హిందువులు, బౌద్ధులు, సిక్కులు మాత్రమే ఎస్‌సి హోదాకు అర్హులు



న్యూఢిల్లీ : **వాస్తవ తెలంగాణ:** హిందువులు, బౌద్ధులు, సిక్కులు మాత్రమే ఎస్‌సి హోదాను పొందగలరన్న ఆంధ్రప్రదేశ్ హైకోర్టు తీర్పును సుప్రీంకోర్టు మంగళవారం సమర్థించింది. క్రైస్తవ మతం సహా ఒక వ్యక్తి ఏ మతంలోకి మారినా, ఎస్‌సి కమ్యూనిటీ సభ్యులకు లభించే ప్రయోజనాలను పొందలేరని పేర్కొంది. "హిందూ మతం కాకుండా వేరే మతాన్ని అనుసరించే ఏ వ్యక్తి కూడా షెడ్యూల్డ్ కులానికి చెందిన వ్యక్తిగా పరిగణించబడరు" అని నిర్దేశించే రాజ్యాంగ (షెడ్యూల్డ్ కులాలు) ఉత్తర్వు, 1950లోని క్లాజ్ 3ను జస్టిస్ పి.కె.మిశ్రా నేతృత్వంలోని ధర్మాసనం తీర్పులో ప్రస్తావించింది. ఈ నిబంధన కింద ఉన్న పరిమితి సంపూర్ణమైనదని పేర్కొంది. 1950లోని క్లాజ్ 3లో పేర్కొనబడని ఏ మతంలోకి అయినా ఎస్‌సి సభ్యుడు మారితే, అతను రిజర్వ్ కేటగిరీ హోదాను కోల్పోవడానికి దారితీస్తుందని కోర్టు పేర్కొంది. క్రైస్తవమతంలోకి మారిన ఎస్‌సి వ్యక్తి, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగల (అత్యాచారాల నివారణ) చట్ట ఉల్లంఘన జరిగిందని వాదించలేరని తెలిపింది.క్రైస్తవమతంలోకి మారి, ప్రస్తుతం పాస్టర్‌గా వ్యవహరిస్తున్న ఒక వ్యక్తి, తనపై దాడికి పాల్పడ్డారంటూ కొంతమంది వ్యక్తులపై షెడ్యూల్డ్ కులాల, షెడ్యూల్డ్ తెగల (అత్యాచారాల నివారణ ) చట్ట కింద దాఖలు చేసిన పిటిషన్‌పై విచారణ చేపట్టిన సుప్రీంకోర్టు ఈ ఉత్తర్వులిచ్చింది.

# గ్యాస్ కొరత.. నష్టాల ఊబిలోకి హోటల్స్

**వాస్తవ తెలంగాణ:** పశ్చిమాసియా సంక్షోభం, ఇంధన దిగుమతుల అంతరాయం కారణంగా దేశవ్యాప్తంగా కమర్షియల్ ఎల్పీజీ సిలిండర్ల తీవ్ర కొరత ఏర్పడి హోటల్ రంగం కుదేలవుతోంది. హైదరాబాద్‌లో వేలాది హోటళ్లు, చిన్న టిఫిన్ సెంటర్లు మూతపడే పరిస్థితికి చేరాయి. ఈ సంక్షోభం వల్ల కొన్ని హోటళ్లు మెనూ తగ్గించడమే కాకుండా, బిల్లులపై ప్రత్యేక చార్జులు వసూలు చేస్తున్నాయి. కొందరు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకొని హోటల్స్‌ను నడిపిస్తున్నారు. ఖర్చు పెరగడంతో యజమానులు ధరలు కూడా పెంచుతున్నారు. దేశ వ్యాప్తంగా కమర్షియల్ గ్యాస్ కొరత కారణంగా హోటళ్లు, రెస్టారెంట్ల యజమానులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్యాస్ కొరత వల్ల కొందరు వాటిని మూసివేశారు. ఖర్చులు భరించలేక కొందరు హోటళ్లలో మెనూలను తగ్గించుకుంటున్నారు. మరికొందరు కట్టెలను వినియోగించి వంట చేయాల్సిన పరిస్థితి నెలకొంది. కట్టెలతో వంట చేయడం సమయం ఎక్కువ తీసుకుంటోంది. గ్యాస్‌తో 30-35 నిమిషాల్లో అయ్యే వంట, ఇప్పుడు గంటకు పైగా సమయం పడుతోంది. దీంతో కస్టమర్లు వెయిట్ చేయలేక వెళ్లిపోతున్నారు.

# నేరాల నియంత్రణలో సి సి కెమారాల పాత్ర కీలకం : కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్




**వాస్తవ తెలంగాణా కంటోన్మెంట్ /** .కంటోన్మెంట్ నియోజకవర్గం లోని మోండా డివిజన్ ఈస్ట్ మారేడ్ పల్లి టీచర్స్ కాలనీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సి సి కెమారాలను కంటోన్మెంట్ ఎమ్మెల్యే శ్రీగణేష్ మంగళవారం కాలనీ వాసులు, పోలీస్ అధికారులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ నేరాల నియంత్రణలో సి సి కెమారాల పాత్ర ఎంతో కీలకమని, కాలనీ అసోసియేషన్ సభ్యులు సామాజిక బాధ్యతతో కెమారాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని, సి సి కెమారాలు నేరాలు జరుగకుండా మరియు నేరాలు జరిగినప్పుడు నేరస్తులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవడానికి ఎంతో ఉపయుక్తంగా ఉంటాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో కాలనీ అసోసియేషన్ అధ్యక్షులు సాయి ప్రకాష్, జనరల్ సెక్రటరీ సుకుమార్, కోశాధికారి సుధీర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు నాగేష్ యాదవ్, గౌరీ శంకర్, అరవింద్ యాదవ్, వైష్ణవి యాదవ్, నందికంటి రవి, అరుణ్ యాదవ్, నర్సింగరావు, బాబూరావు, సాంబయ్య తదితరులు పాల్గొన్నారు

# ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం పేదల జీవితాల్లో చిరునవ్వు కళ్యాణ లక్ష్మి, షాదీ ముబారక్ పథకాలు



**వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్ ప్రతినిధి (ఆంజనేయులు)** పావన్నపేట మండల మండలంలోని పొడిచన్ పల్లి గ్రామంలో 48 లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల పత్రాల మంజూరి కార్యక్రమంలో ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. అనంతరం మంజీరా గార్డెన్ లో కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమాన్ని ఎమ్మెల్యే నిర్వహించారు. ఈ సందర్భంగా మెదక్ ఎమ్మెల్యే రోహిత్ రావు మాట్లాడుతూ.. గ్రామాల్లో పూరి గుడిసెలు ఉండకుండా చూడడమే లక్ష్యమన్నారు. పేదలకు, అర్హులందరికీ గౌరవప్రదంగా బ్రతకడానికి ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలతో పేదల జీవితాల్లో చిరునవ్వులు చూడాలన్నారు. విడుదలవారీగా ఎన్ని ఇండ్లు



మంజూరు చేయడానికి అయినా సిద్ధమన్నారు. బిల్లులు సకాలంలో అందుతున్నాయి అన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు ఒక 118 కోట్లు లబ్ధిదారుల ఖాతాలో జమ చేశామన్నారు. ఏప్రిల్ మాసంలో మరిన్ని ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు చేస్తామని తెలిపారు. కళ్యాణ్ లక్ష్మి షాదీ ముబారక్ పథకాలు నిరుపేదల పాలిట వరమని రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈ పథకం ద్వారా ఆర్థిక స్తోమత లేకుండా దారిద్ర్యరేఖకు దిగువన ఉన్న నిరుపేద కుటుంబాల ఆడపిల్లలకు పెండ్లి సహాయ నిమిత్తం ఎంతో మందికి లబ్ధి చేకూరుతుందన్నారు.ఈ కార్యక్రమంలో హౌసింగ్ పీడీ మాణిక్యం, హౌసింగ్ అధికారులు, స్థానిక సర్పంచ్, లబ్ధిదారులు ప్రజలు పాల్గొన్నారు.

# భూ భారతి దరఖాస్తులు పరిష్కరించడంలో తహసిల్దార్లకు చిత్తశుద్ధి అవసరం



**వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్ ప్రతినిధి (ఆంజనేయులు )**జిల్లాలో భూభారతి దరఖాస్తుల పరిష్కరించడానికి తాసిల్దారులకు చిత్తశుద్ధి అవసరమని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అన్నారు. మంగళవారం కలెక్టరేట్లోని కలెక్టర్ ఛాంబర్ నుండి భూభారతి పెండింగ్ దరఖాస్తులు, ప్రజావాణి



పెండింగ్ దరఖాస్తులు, ఓటర్ జాబితా తయారీ, ఇతర రెవెన్యూ సమస్యలపై గూగుల్ మీట్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. భూభారతి పెండింగ్ దరఖాస్తులను పరిష్కరించడంలో తహసిల్దారులు చిత్తశుద్ధితో పని చేయాలన్నారు. రెవెన్యూ శాఖలో పారదర్శకత పాలన కోసం అధికారులందరూ పాటుపడాలన్నారు. ప్రజావాణి పెండింగ్ దరఖాస్తులు, భూభారతి పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించడంలో అలసత్వం వహిస్తే శాఖపరమైన చర్యలకు వెనకాడబోమని తహసీదార్లను ముక్తకంఠంతో హెచ్చరించారు. మండలాల వారీగా భూభారతి, ప్రజావాణి ఎన్ని దరఖాస్తులు పెండింగ్లో ఉన్నాయో వాటన్నింటినీ శాశ్వతంగా పరిష్కరించి ఫిర్యాదుదారులకు న్యాయం చేయాలన్నారు. ఓటర్ జాబితా తయారీ అన్ని శాఖల సమన్వయం చేసుకొని త్వరితగతిన పూర్తి చేయాలని పేర్కొన్నారు. క్షేత్రస్థాయిలో సమస్యలు ఎదురైతే ఉన్నతాధికారుల దృష్టికి తేవాలని సొంత నిర్ణయాలకు తావు లేదన్నారు. గూగుల్ మీట్లో ఆర్డీవోలు,తాసిల్దార్లు, రెవెన్యూ అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# క్షయ రహిత మెదక్ జిల్లాగా తీర్చిదిద్దాలి మెదక్ శాసనసభ్యులు రోహిత్ రావు

**వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్ ప్రతినిధి (ఆంజనేయులు)** క్షయవ్యాధి (టీబీ) నివారణ పైన అవగాహన కార్యక్రమాలను చేపట్టాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ తెలిపారు. మంగళవారం స్థానిక ప్రభుత్వ హాస్పిటల్ లో ప్రపంచ క్షయ నివారణ దినోత్సవం సందర్భంగా టీబీ ముక్త్ భారత్ అభియాన్ జ.2.0 అనే కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా మెదక్ శాసనసభ్యులు మైనాంపల్లి రోహిత్ రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మెదక్ శాసన శాసనసభ్యులు మైనంపల్లి రోహిత్ రావు మాట్లాడుతూ....క్షయవ్యాధి (టీబీ) నియంత్రణలో ముందస్తు గుర్తింపు, స్క్రీనింగ్, ప్రజల్లో అవగాహన పెంపు పై ప్రత్యేకంగా దృష్టి సారించాలన్నారు .మొదటగా అధిక జనాభా గల ప్రాంతం లో ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు లక్షణాలు ఉన్న వారిని వెంటనే గుర్తించి చీూూ, మైక్రోస్కోపీ, ఎక్స్-రే ద్వారా నిర్ధారణకు పంపాలని అధికారులకు సూచించారు. డయాబెటిస్, పోషకాహార లోపం, వృద్ధులు ఇతర సహవ్యాధులు ఉన్నవారిని ప్రాధాన్యంగా స్క్రీనింగ్ చేయాలని,అన్ని కేసులను చీ×ఖూనాూ పోర్టల్లో నమోదు చేయాలన్నారు జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ మాట్లాడుతూ.. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యాచరణలో భాగంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహించడం జరిగిందని,అన్ని శాఖల మధ్య సమన్వయం పెంచి ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని...గుర్తించిన టీబీ రోగులకు తక్షణ చికిత్స అందించాలన్నారు . టీబీ నివారణకు ముందస్తు గుర్తింపు, వ్యక్తిగత పరిశుభ్రత, బీజ+ టీకా టీబీ లక్షణాలపై (దగ్గు, జ్వరం, బరువు తగ్గడం, రాత్రిపూట చెమటలు) ప్రజల్లో అవగాహన పెంపు చేయాలని సూచించారు.జిల్లా




వైద్యాధికారి శ్రీరామ్ మాట్లాడుతూ ..జిల్లాలో అధిక ప్రమాదం ఉన్న 99 గ్రామాలు గుర్తించడం జరిగిందని, జిల్లావ్యాప్తంగా 389 కేసులు గుర్తించామని తెలిపారు. క్షయ వ్యాధిగ్రస్తులకు నిశ్చయ పోషణ అభియాన్ పథకం కింద నెలకు వెయ్యి రూపాయల ఆర్థిక సాయం అందజేస్తున్నట్లు తెలిపారు.ఆ గ్రామాల్లో సమగ్ర స్క్రీనింగ్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు,ఈ కార్యక్రమంలో ప్రజలందరికీ ఎక్స్-రే, స్పుటమ్ పరీక్షలు, హీమోగ్లోబిన్ (ఎఎ) పరీక్షలు చేయనున్నట్లు తెలిపారు. డి సి హెచ్ శివ దయాల్ మాట్లాడుతూ..ఈ కార్యక్రమం కేంద్ర ప్రభుత్వ టీబీ ముక్త భారత్ అభియాన్ 2.0 లక్ష్యాలకు అనుగుణంగా కార్యక్రమాలను అమలు చేస్తున్నామన్నారు. ు క్షయ వ్యాధి గుర్తించిన గ్రామాల్లో ఆరోగ్య సిబ్బంది మొదటి ప్రాధాన్యతగా ఇంటింటిని సందర్శించి ఇంట్లో ఉన్న 14 సంవత్సరాల పైబడిన వ్యక్తులకు పలు పరీక్షలు చేసి వ్యాధి లక్షణాలు కలిగిన వ్యక్తులకు తక్షణమే చికిత్స అందించడం జరుగుతుందన్నారు. అంతకుముందు క్షయ వ్యాధి నివారణకై కరపత్రాలు విడుదల చేశారు. అనంతరం క్షయ వ్యాధి నివారణ కోసం పాటుపడాలని ప్రతిజ్ఞ చేశారు.ఈ సమావేశంలో మున్సిపల్ చైర్ పర్సన్ రాధిక భూపతి రాజ్, వైస్ చైర్మన్ దొంతి నరేష్ గౌడ్, కౌన్సిలర్ హరిత నర్సింగరావు, సూపరిండెంట్ సరిత దేవి, శైలజ, హరి ప్రసాద్, ప్రజా ప్రతినిధులు, ప్రోగ్రాం అధికారులు, ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# వేసవికాలంలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలి జిల్లా కలెక్టర్ ప్రతిమాసింగ్






**వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్ ప్రతినిధి (ఆంజనేయులు )**వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని తాగునీటి ఎద్దడి నివారణకు మెదక్ జిల్లాలో సమ్మర్ యాక్షన్ ప్లాన్ సిద్ధం చేయాలని జిల్లా కలెక్టర్ ప్రతిమా సింగ్ అధికారులను ఆదేశించారు కలెక్టరేట్ కార్యాలయంలో వీడియో సమావేశ హాల్లో మిషన్ భగీరథ, ఇంట్రా గ్రిడ్, గ్రిడ్ ,ఇరిగేషన్, ఫారెస్ట్, ఆర్డబ్ల్యూఎస్ గ్రామపంచాయతీ, గ్రౌండ్ వాటర్, మున్సిపల్ కమిషనర్స్, వివిధ శాఖల అధికారులతో వేసవికాలంలో త్రాగునీటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు పై కలెక్టర్ సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యచరణలో భాగంగా జిల్లాలో గ్రామాలలో ప్రజలకు త్రాగునీటి సమస్యను తలెత్తకుండా సమ్మర్ యాక్షన్ ప్లాన్ ద్వారా పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు. వేసవిలో జిల్లాలోని 917హ్యాబిటేషన్లలో నివసిస్తున్న 1,76,170 కుటుంబాలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా తాగునీటి సరఫరా జరిగేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. . జిల్లాలో ఉన్న 1485 తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయాలని తెలిపారు. తాగునీటి సరఫరా అంశం అత్యంత కీలకమైనదని, క్షేత్రస్థాయిలో ప్రతి రోజూ పకడ్బందీగా పర్యవేక్షణ జరగాలని సూచించారు.మౌలిక సదుపాయాలు: బోర్ వెల్స్ మరమ్మతులు, ట్యాంకుల క్లీనింగ్ పనులను తక్షణమే పూర్తి చేయాలన్నారు. ఎక్కడైనా నీటి ఎద్దడి తలెత్తిన వెంటనే యుద్ధప్రాతిపదికన ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టాలని, అవసరమైన చోట చేతిపంపులు, బోరు మోటార్లు, పైపైన్ మరమ్మతులు సకాలంలో పూర్తి చేయాలని తెలిపారు. అవసరమైతే గ్రామపంచాయతీ ట్యాంకర్ల ద్వారా నీటి సరఫరా చేపట్టాలని సూచించారు.మిషన్ భగీరథ ద్వారా నిర్ణీత పరిమాణంలో నీరు సరఫరా అవుతోందో లేదో మండల అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు నిర్ధారించుకోవాలని తెలిపారు. సంబంధిత శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పని చేస్తూ ఈ వేసవిలో ఏ ఒక్క నివాస ప్రాంతంలోనూ నీటి సమస్య తలెత్తకుండా నిబద్ధతతో పని చేయాలని సూచించారు. జిల్లా స్థాయి అధికారులు మారుమూల గ్రామాలను సందర్శించి వాస్తవ పరిస్థితిని తెలుసుకోవాలని ఆదేశించారు.

ప్రస్తుతం వేసవి కాలాన్ని దృష్టిలో పెట్టుకుని మిషన్ భగీరథ ఆర్డబ్ల్యూఎస్, మున్సిపల్ కమిషనర్ సమిష్టిగా పని చేయాలన్నారు.జిల్లా అటవీ శాఖ ఆధ్వర్యంలో వన్య ప్రాణులకు దప్పిక తీర్చేందుకు చర్యలు తీసుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ నగేష్, డిఎఫ్.ఓ జోజి, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు, డిపిఓ యాదయ్య, మిషన్ భగీరథ ఇంట్రా గ్రిడ్ ఈ..ఈ సంపత్ కుమార్, గ్రిడ్ నాగభూషణం, సంబంధిత మున్సిపల్ కమిషనర్స్, గ్రౌండ్ వాటర్ వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఆర్టీసీలో విద్యుత్ బస్సుల కొనుగోలు సంస్థ ద్వారానే చేయాలి కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



**వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్ ప్రతినిధి (ఆంజనేయులు)** ఆర్.టి.సి సంస్థ విద్యుత్ బస్సుల కొనుగోలు ఆర్.టి.సి. సంస్థ ద్వారానే చేయాలని, ప్రభుత్వం ఇచ్చే సబ్సిడీలు ప్రైవేట్ వ్యక్తులకు కాకుండా ఆర్.టి.సి.కే ఇవ్వాలని, కార్మికుల అన్ని రకాల సమస్యలను పరిష్క రించాలని సి.ఐ.టి.యూ. మెదక్ జిల్లా కార్యదర్శి ఏ.మల్లేశం డిమాండ్ చేశారు.సి.ఐ.టి.యూ రాష్ట్ర వ్యాపిత పిలుపులో భాగంగా మెదక్ డిపో ముందు ధర్నా నిర్వహించారు.ధర్నాను ఉద్దేశించి ఏ.మల్లేశం మాట్లాడుతూ 2019 లో కేంద్ర ప్రభుత్వం ఎం.వి.యాక్ట్ సవరణ ద్వారా దేశంలోని అన్ని ఆర్.టి.సి.ల్లో విద్యుత్ బస్ ల కొనుగోలు విధానం తెచ్చింది న్నారు.ఈ విధానం ద్వారా విద్యుత్ బస్ ల పథకాల్ని గ్రాస్ కాస్ట్ కాంట్రాక్ట్ పద్ధతిలో ఉంటాయన్నారు.ఈ విధానం ద్వారా బస్సుల కొనుగోలు,నిర్వహణ, ఆపరేషన్ నాని ప్రైవేట్ సంస్థలే.బస్ స్టాండ్,రోడ్ల నిర్వహణ ఆర్.టి.సి.ది కాగా లాభాలు నాని ప్రైవేట్ కంపెనీలకు వెళ్తాయి అని ఏ.మల్లేశం తీవ్రంగా విమర్శించారు.రాజకీయ అవసరాల్లో నిత్యం కేంద్రాన్ని విమర్శించే తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సమస్యల పై మాత్రం కేంద్రాన్ని విమర్శించ దం లేదన్నారు.ప్రజాధనాన్ని లూటీ చేసి కార్పోరేట్ శక్తులకు అప్పగించే విషయంలో కేంద్రం,రాష్ట్రానిధి ఒకే దారి అని స్పష్టంగా అర్థం అవుతుందని అన్నారు. కార్పోరేట్ కంపెనీల లాభాలు పెంచే విద్యుత్ బస్సుల విధానాన్ని తెలంగాణ రాష్ట్రంలో అమలు చేస్తామని, హైదరాబాద్ సిటీలోని డీజిల్ బస్సులు అన్ని జిల్లాలకు తరలించి సిటీ లో సంపూర్ణంగా విద్యుత్ బస్సులు ప్రవేశ పెడతామని ముఖ్యమంత్రి స్వయంగా ప్రకటించడం చూస్తే రాష్ట్రంలో ఆర్.టి.సి లో ప్రైవేటీకరణ విధానాలు వేగవంతం చేశారని అర్థం అవుతుందని అన్నారు.ఆర్.టి.సి ప్రభుత్వ రంగంలో ఉండడం వల్ల విద్యార్థులు,దివ్యాంగులు, మహిళలు ఇలా అనేక తరగతుల ప్రజలకు రాయితీలు వస్తున్నాయని ఏ.మల్లేశం అన్నారు. కేంద్ర ప్రభుత్వం ఇప్పటికే బి.ఎస్. ఎన్.ఎల్,సింగరేణి,ఎల్.ఐ.సి లాంటి ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటీకరణ చేసినట్లు ఆర్.టి.సి నీ కూడా ప్రైవేట్ పరం చేయాలని కుట్రలు చేస్తుందన్నారు. ఆర్.టి.సి.సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజల పై కూడా ఉందన్నారు. ఈ ఉద్యమంలో ప్రజలు కలసి రావాలని ఏ.మల్లేశం ప్రజలను కోరినారు.ఇప్పటికే ఆర్.టి.సి లో కార్మికుల వేతన సవరణలు జరగక,రిటైర్మెంట్ బెనిఫిట్స్ సకాలంలో రాక. గుండెపోటు మరణాలు,ఆత్మహత్యలు జరుగుతాయి అని అన్నారు.కార్మికులకు 2021,2025 పే స్కేల్ ఇవ్వలేదు, 2017 వేతన సవరణ ఏరియర్స్ చెల్లించకపోవడం వల్ల కార్మిక కుటుంబాలు తీవ్ర ఇబ్బందుల్లో ఉన్నాయని విమర్శించారు.ధర్నా అనంతరం మెదక్ డిపో మేనేజర్ కు వినతి పత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో సి.ఐ.టి.యూ జిల్లా కోశాధికారి కే.నరసమ్మ, సహాయ కార్యదర్శి జె.సంతోష్, కార్యకర్తలు శౌకత్, లచాగౌడ్ పాల్గొన్నారు.

# విద్యా రంగాన్ని విస్మరిస్తున్న పాలకులు

**తెలంగాణ బడ్జెట్ లో విద్యా రంగానికి 20శాతం నిధులు కేటాయించాలి**
**ఏండ్ల తరబడి పెండింగ్ లో ఉన్న బెనిఫిట్స్ విడుదల చేయాలి**
**కలెక్టరేట్ ఎదుట టీపీటీఎఫ్ ఆందోళన**






**వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్** విద్యారంగానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తామని రాష్ట్ర బడ్జెట్ లొ 8.2 శాతం కేటాయించడం పై( టిపిటి ఎఫ్)సంఘం మండిపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగానికి ఈ బడ్జెట్ లో 8.2 శాతం మాత్రమే కేటాయించి ఈ రాష్ట్ర ప్రజలను మళ్లీ ఒకసారి నిరాశ పరిచిందని తెలంగాణ ప్రోగ్రెసివ్ టీచర్స్ ఫెడరేషన్(టిపిటిఎఫ్)మెదక్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు కొంగోటి యాదగిరి,పి.వెంకట్రామిరెడ్డి లు ఆరోపించారు.మంగళ వారం రోజు ప్రభుత్వ నిరంకుశ వైఖరిని నిరసిస్తూ రాష్ట్ర వ్యాప్త ఆందోళనలో భాగంగా మంగళవారం కలెక్టరెట్ ఎదుట ఆందోళన చేపట్టారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయ సంఘాలు, విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నట్లుగా విద్యారంగానికి 20 శాతం గానీ, తెలంగాణ విద్యా కమిషన్ సూచించి నట్లు 18 శాతం గాని,కనీసం కాంగ్రెస్ పార్టీ తన మ్యానిఫెస్టో లో ప్రకటించి నట్లుగా 15 శాతం కూడా బడ్జెట్ లో ప్రకటించకపోవడం వలన ప్రభుత్వ మాటలకు చేతలకు పొంతన లేదని అర్థమవు తుందని ఆవేదన వ్యక్తం చేశారు.పాఠశాలలో ప్రైమరీ తరగతుల నిర్వహణ, విద్యార్థుల కిట్,బ్రేక్ ఫాస్ట్ పథకాలను ఈ విద్యా సంవత్సరం నుండి ప్రవేశ పెట్టడం జరుగుతుందని ప్రభుత్వం ప్రకటించడం జరిగిందని,ఇంత తక్కువ బడ్జెట్ లో కారణంగా పథకాలు ప్రకటనలకే పరిమితం అయ్యే ప్రమాదం లేకపోలేదన్నారు.యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్,తెలంగాణ పబ్లిక్ స్కూల్,స్కిల్ యూనివర్సిటీ లాంటివి మాట మాటకు పేర్కొనే ముఖ్యమంత్రి ఇంత తక్కువ బడ్జెట్ లో వాటిని ఏ విధంగా అమలు చేస్తారో చెప్పాలని డిమాండ్ చేశారు.ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ లో విద్యారంగ కేటాయింపులపై పున:పరిశీలన చేసి మానవ వనరుల అభివృద్ధికి కీలక పాత్ర పోషించే విద్యారంగానికి అధిక బడ్జెట్ కనీసం 15 శాతం ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు.పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని,పిఆర్సిని వెంటనే ప్రకటించాలని వారు డిమాండ్ చేశారు.రెగ్యులర్ డీఈఓ పోస్టులను మంజూరు చేయాలన్నారు.ఎంఈఓ,డైట్ లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలన్నారు.పూర్వప్రాథమిక పాఠశాలలో అర్హులైన ఉపాధ్యాయులను నియమించాలని డిమాండ్ చేశారు.పెండింగ్ లో ఉన్న డి.ఏ.లను విడుదల చేయాలని, రిటైర్డ్ ఉద్యోగ,ఉపాధ్యాయు ల బకాయిలను ఏక కాలంలో చెల్లించాలన్నారు.డైట్లలోని లెక్చరర్ పోస్టులను భర్తీ చేయాలని,అన్ని జిల్లాలను ఇఎల్టిసి కేంద్రాలను ప్రారంభించి ఆంగ్లభాష నైపుణ్యాలను పెంపొందించా లన్నారు.అనంతరం సమస్యలతో కూడిన వినతిపత్రంను కలెక్టరేట్ కార్యాలయ ఏఓ యూనిస్ కు అందజేశారు.ఈ ఆందోళన కార్యక్రమంలో రాష్ట్ర మాజీ అధ్యక్షులు కొండల్ రెడ్డి,రాష్ట్ర పూర్వ కార్యదర్శి రామ్ కిషన్,మాజీ మండల విద్యాధికారి నీల కంఠం జిల్లా ఉపాధ్యక్షులు గోపాల్,యాదగిరి బొమ్మర్తి,మొయిజోద్దీన్,శ్రీనివాస్ రెడ్డి, జిల్లా కార్యదర్శులు సాయి బాబా,రాజయ్య,దేవి సింగ్ సురేందర్,శ్రీనివాస్ జాదవ్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు సంగయ్య,హీరా లాల్ రాజేంద్ర ప్రసాద్,సంగీత నజీరోద్దీన్,అల్వాల్ రమేష్ రాష్ట అకడమిక్ సభ్యులు మధుసూదన్,శశిధర్ రెడ్డి ఉమ్మడి జిల్లా అధ్యక్షులు జె.రామ్ చంద్రం,ముత్యాలు వివిధ మండల శాఖ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు పిండి నాగరాజు,నర్సింగం, చాంద్ పాషా,మహ్మద్ అమీరుద్దీన్,కిరణ్ కుమార్,మల్లేశం,చౌదరి మాధవ్,రాజశేఖర్,మురళి, శ్రీనివాస్,నాగభూషణం, కమ్మరి శ్రీనివాస్,రమేష్,కొమ్మ శ్రీనివాస్ పాల్గొన్నారు.


## జనగణన విధులు సమర్ధవంతంగా నిర్వహించాలి జిల్లా అదనపు కలెక్టర్ నగేష్




**వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్ ప్రతినిధి (ఆంజనేయులు )**జనగణన-2027 మొదటి విడతలో భాగంగా ఇండ్ల గణన విధులు సమర్ధవంతంగా నిర్వహించాలని జిల్లా అదనపు కలెక్టర్ అన్నారు. మంగళవారంవారం జిల్లాలోని సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో ముఖ్య ప్రణాళిక అధికారి, జిల్లా జనగణన అధికరులు ఉపగణాంక అధికారులతో అదనపు జనగణన అధికారి లతో కలిసి మండల ప్రణాళిక గణాంక అధికారులు, సాంకేతిక సహాయకులకు జనగణన ప్రక్రియ, యాప్ నిర్వహణపై నిర్వహించిన శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ ..ప్రభుత్వం అమలు చేయబోయే ప్రణాళికలలో భాగంగా సమర్ధవంతంగా అమలు చేసేందుకు జనాభా లెక్కల ప్రాతిపదిక ఉపయోగపడుతుందని తెలిపారు. జనగణన విధులను సక్రమంగా నిర్వహించాలని, ప్రక్రియ నిర్వహణ, సాంకేతికత వినియోగంపై అవగాహన కలిగి ఉండాలని, ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి యాప్ ద్వారా జనగణన చేయాలని తెలిపారు. సంక్షేమ పథకాలు అర్హులకు చేరవేయడానికి ఖచ్చితమైన గణాంకాలు అవసరమని, ఈ తరుణంలో ఎటువంటి పొరపాట్లు జరగకుండా జాగ్రత్త వహించాలని, దేశంలోనే తొలిసారిగా జనగణనను పూర్తిగా డిజిటల్ పద్ధతి ద్వారాహొచేపట్టడం జరుగుతుందని తెలిపారు. మే 11వ తేదీ నుండి జూన్ 9వ తేదీ వరకు జనగణనలో భాగంగా ఇండ్ల గణన కార్యక్రమం కొనసాగుతుందని, కుటుంబాల వివరాలు పూర్తిగా నమోదు చేయబడతాయని, ఏప్రిల్ మొదటి వారం నుండి సన్నాహక పనులు జరుగుతాయని తెలిపారు. యాప్ నిర్వహణలో ఎటువంటి సాంకేతిక సమస్యలు తలెత్తిన వెంటనే పరిష్కరించి ప్రక్రియ సజావుగా సాగేలా అధికారులు కృషి చేయాలని తెలిపారు. మండల ప్రణాళిక గణాంక అధికారులు చార్జ్ క్లర్క్ / అసిస్టెంట్ ఛార్జ్ క్లర్క్ లుగా, కంప్యూటర్ ఆపరేటర్లు సాంకేతిక సహాయకులుగా తమకు నిర్దేశించిన విధులను సమర్ధవంతంగా నిర్వహించాలని తెలిపారు. శిక్షకులు నేర్పించే అంశాలను ఏకాగ్రతతో నేర్చుకోవాలని, శిక్షణలో పొందిన అవగాహనతో క్షేత్రస్థాయిలో సమర్ధవంతంగా విధులు నిర్వహించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి రాజిరెడ్డి సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి సంపూర్ణ సహకారం

**పటాన్చెరు శాసనసభ్యులు, రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గూడెం మహిపాల్ రెడ్డి**



**పటాన్చెరు,వాస్తవ తెలంగాణ న్యూస్:** పల్లె నుండి పట్నం వరకు నిత్యం ప్రజలతో సంబంధాలు కలిగి ఉండే రేషన్ డీలర్ల సమస్యల పరిష్కారానికి ఎల్లప్పుడూ అండగా ఉంటానని, అవసరమైన పక్షంలో ఉద్యమాలకు సైతం సిద్ధమని పటాన్చెరు శాసన సభ్యులు, రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. మంగళవారం పటాన్చెరు డివిజన్ పరిధిలోని జిఎంఆర్ కన్వెన్షన్ సెంటర్లో ఏర్పాటు చేసిన రేషన్ డీలర్ల సంఘం సంగారెడ్డి జిల్లా కార్యవర్గ సమావేశానికి ఎమ్మెల్యే జీఎంఆర్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రకృతి విపత్తుల సంభవించిన, కరోనా లాంటి మహమ్మారి మూలంగా లక్షలాదిమంది చనిపోయిన సమయంలోనూ ప్రాణాలకు తెగించి ప్రజలకు నిత్యవసర వస్తువులు అందించడంలో రేషన్ డీలర్ల పాత్ర శ్లాగనీయమన్నారు. దశాబ్ద కాలంగా రేషన్ డీలర్లు వివిధ సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. గత అసెంబ్లీ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ రేషన్ డీలర్లకు ఇచ్చిన ప్రధాన హామీలను వెంటనే అమలుపరచాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో డీలర్ల సంఘం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. రేషన్ డీలర్ల సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాయికోటి రాజు మాట్లాడుతూ.. రేషన్ డీలర్లు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలతో పాటు, ప్రతి రేషన్ డీలర్ కు 10 లక్షల రూపాయల ఇన్సూరెన్స్, ఎంఎల్ఎస్ పాయింటలో ఎలక్ట్రానిక్ వే బ్రిడ్జిలు, కరోనా సమయంలో మరణించిన రేషన్ డీలర్ల కుటుంబ సభ్యులకు తిరిగి రేషన్ దుకాణాలు కేటాయించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా కార్యవర్గ సభ్యులు, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.

## అర్హులైన ప్రతి ఒక్కరికి ఇందిరమ్మ ఇల్లు ఎమ్మెల్యే జిఎంఆర్ ..



**పటాన్చెరు,వాస్తవ తెలంగాణ న్యూస్:** పటాన్చెరు నియోజకవర్గ పరిధిలో అర్హులైన ప్రతి ఒక్కరికి సొంతింటి కలను సాకారం చేయడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలోని లకడారం గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల పథకం లబ్ధిదారులకు ప్రోసిడింగ్ పత్రాలతో పాటు.. గృహ నిర్మాణ పనులకు శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదలకు సొంత స్థలం ఉంటే ఐదు లక్షల రూపాయల ఆర్థిక సహాయం అందిస్తూ సొంతింటిని నిర్మించడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం లక్ష్యమని తెలిపారు. నియోజకవర్గం వ్యాప్తంగా 3500 ఇల్లు మంజూరు అయ్యాయని తెలిపారు. ప్రజా పాలనలో దరఖాస్తు చేసుకున్న వారిలో అర్హులైన వారిని గుర్తించి లబ్ధిదారులను ఎంపిక చేయడం జరిగిందని తెలిపారు. పూర్తి పారదర్శకతతో రాజకీయాలకు అతీతంగా అర్హులకే వీటిని కేటాయించడం జరిగిందని స్పష్టం చేశారు. ప్రభుత్వం అందిస్తున్న ఆర్థిక సహాయాన్ని దుర్వినియోగం చేయకుండా ఇళ్లను నిర్మించుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఇళ్ల కోసం దళారులను ఆశ్రయించి మోసపోవద్దని కోరారు. ఇళ్ల నిర్మాణ దశకు అనుగుణంగా నిధులు విడుదల అవుతాయని తెలిపారు. నియోజకవర్గ పరిధిలో ఇల్లు లేని కుటుంబాలు వేల సంఖ్యలో ఉన్నాయని.. ఇందుకు అనుగుణంగా ఇళ్ల కేటాయింపును పెంచాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ సుమలత, మున్సిపల్ కమిషనర్ వెంకట కిషన్, స్థానిక కౌన్సిలర్లు, బిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఇసుక అక్రమ రవాణా పై ఉక్కు పాదం మెదక్ రెవిన్యూ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్



**వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్ ప్రతినిధి (ఆంజనేయులు )**ఇసుక అక్రమ రవాణా పై కఠిన చర్యలు తీసుకోవాలని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు మంగళవారం ఆర్ ఐ లక్ష్మణ్ ఆధ్వర్యంలో పోలీస్, రెవిన్యూ సంయుక్త ఆధ్వర్యంలో మెరుపు దాడులు నిర్వహించారు.. మంగళవారం రోజున మెదక్ పసుపులేరు వాగు దగ్గర గంగమ్మ గుడి, ఎల్లమ్మ గుడి పరిసరాల ప్రాంతములో అక్రమ ఇసుక రవాణా చేసే దారిని గుర్తించి అట్టి దారిని జేసీబీ తో త్రవ్వి మరియు అక్రమంగా నిలువ చేసిన 60 టన్నుల ఇసుకని గుర్తించి అట్టి ఇసుకని తిప్పర్ల ద్వారా మెదక్ లో ఉన్న ఖఅఆ బజార్ కు తరలించటం జరిగిందన్నారు. మెదక్ తాసిల్దార్ కార్యాలయం రెవిన్యూ ఇన్స్పెక్టర్ లక్ష్మణ్ మాట్లాడుతూ ఇసుక అక్రమ రవాణాను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించేది లేదని ఈ సందర్భంగా ఆయన వెల్లడించారు. ఇసుక అక్రమ రవాణా అడ్డుకట్ట వేసేందుకు పటిష్ట చర్యలు తీసుకుంటున్నామన్నారు ఈ కార్యక్రమంలో సంబంధిత రెవెన్యూ పోలీస్ యంత్రాంగం పాల్గొన్నారు.

## ఈనెల 28న మెదక్ కోర్టులో మెగా లోక్ అదాలత్ రాజీయే రాజమార్గం జిల్లా ఎస్పీ. శ్రీనివాస రావు




**వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్** మెదక్ కోర్టులో ఈ నెల 28 వ తేదీన నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ.శ్రీనివాసరావు,తెలిపారు.ఈ లోక్ అదాలత్ ద్వారా పెండింగ్‌లో ఉన్న వివాదాలను సులభంగా, వేగంగా పరిష్కరించుకునే అవకాశం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు.జిల్లా ఎస్పీ.మాట్లాడుతూ క్రిమినల్ కంపౌండబుల్ కేసులు,సివిల్ తగాదాలు, ఆస్తి విభజన, కుటుంబ పరమైన వివాదాలు,వైవాహిక సమస్యలు,బ్యాంకు రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం,చెక్ బౌన్స్ వంటి కేసుల్లో ఇరువర్గాలు పరస్పరం చర్చించుకుని రాజీకి రావచ్చని తెలిపారు.దీని ద్వారా కోర్టు విచారణలు, దీర్ఘకాల న్యాయ ప్రక్రియల వల్ల కలిగే ఇబ్బందులను నివారించవచ్చన్నారు. చిన్న చిన్న వివాదాలపై కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం,డబ్బు వృథా చేసుకోవడం కంటే రాజీ ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడం ఉత్తమ మార్గమని ఆయన సూచించారు."రాజీయే రాజమార్గం" అని పేర్కొంటూ, జుడీషియల్ శాఖ అందిస్తున్న ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు.జిల్లాలోని పోలీస్ అధికారులు,కోర్టు విధుల్లో ఉన్న సిబ్బంది రాజీ పడదగిన కేసులను గుర్తించి,ఇరు వర్గాలను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. తమ కేసుల్లో రాజీ కావాలనుకునే వారు సమీప పోలీస్ స్టేషన్ లేదా సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు త్వరితగతిన, తక్కువ ఖర్చుతో న్యాయం లభిస్తుందని ఎస్పీ తెలిపారు.

## సీతారాముల కళ్యాణానికి హాజరుకండి ఎమ్మెల్యే జిఎంఆర్ ను ఆహ్వానించిన ఆలయ కమిటీ సభ్యులు



**పటాన్చెరు,వాస్తవ తెలంగాణ న్యూస్:** శ్రీరామనవమి పర్వదినం పురస్కరించుకొని పటాన్చెరు డివిజన్ పరిధిలోని శ్రీ కోదండ సీతారామచంద్రస్వామి ఆలయంలో ఈ నెల 25 నుండి 29 వరకు నిర్వహించనున్న శ్రీ రామనవమి బ్రహ్మోత్సవాలలో పాల్గొనాలని కోరుతూ మంగళవారం సాయంత్రం ఉత్సవ కమిటీ సభ్యులు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ని కలిసి, ఉత్సవాల ఆహ్వాన పత్రికను అందజేశారు. కళ్యాణ మహోత్సవం సందర్భంగా గణపతి పూజ, కళ్యాణం, అన్నప్రసాద వితరణ, స్వామి వార్ల ఊరేగింపు కార్యక్రమాలు ఏర్పాటు చేసినట్లు ఉత్సవ కమిటీ ప్రతినిధులు తెలిపారు.

## జిన్నారం కోదండరామ స్వామి కళ్యాణ మహోత్సవానికి ఆహ్వానం



**గుమ్మడిదల,వాస్తవ తెలంగాణ న్యూస్:** జిన్నారం శ్రీ కోదండరామ స్వామి వారి కళ్యాణ మహోత్సవానికి ఆహ్వాన పత్రికను బి.ఆర్.ఎస్ రాష్ట్ర నాయకులు, సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ములగోవర్ధన్ రెడ్డికి రామాలయ కమిటీ చైర్మన్ ఆంజనేయులు యాదవ్ అందజేశారు.ఈ సందర్భంగా ఈనెల 27న కళ్యాణ మహోత్సవాన్ని అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు జరుగుతున్నాయని తెలిపారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై స్వామివారి ఆశీర్వాదాలు పొందాలని కోరారు. ఈ కార్యక్రమంలో కమిటీ సభ్యులు వెంకటేష్ గౌడ్, గోవర్ధన్ రెడ్డి, ప్రవీణ్, నరేందర్ రెడ్డి, సూర్యనారాయణ, తుడుం రవి పాల్గొన్నారు.

## మగ్దుంపూర్ మాజీ సర్పంచ్ అకాల మరణం వలన ఆయన కుటుంబా నికి ఆర్థిక సహాయం అందజేత మెదక్ జిల్లా జనరల్ సెక్రెటరీ బెండ రమేష్





**వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్** మెదక్ మండలం మాగ్దూంపూర్ గ్రామ మాజీ సర్పంచ్ శ్రీనివాస్ గౌడ్ అకాల మరణం వలన ఆయన కుటుంబం రోడ్డున పడిందని ఆవేదనతో వారి కుటుంబాన్ని పరామర్శించి వారికి ఆర్థిక సహాయం అందజేసిన మెదక్ జిల్లా జనరల్ సెక్రెటరీ బొల్లారం బెండ రమేష్ తన సొంత ఆర్థిక సహాయం 50 కిలోల బియ్యం ను అందజేశారు.ఇట్టి కార్యక్రమంలో గ్రామ సర్పంచ్, లక్ష్మీనారాయణ,ఉప సర్పంచ్,సిద్ధి రాములు, వార్డు మెంబర్లు గ్రామ అధ్యక్షులు,కార్యకర్తలు పాల్గొన్నారు.


## నేడు వెలగటూర్ పీ ఎచ్ సి లో ప్రత్యేక వైద్య శిబిరం : పి హెచ్ సి మెడికల్ ఆఫీసర్ తేజస్విని

**వాస్తవ తెలంగాణ:** ధర్మపురి నియోజకవర్గ ప్రతినిధి మార్చి 24 తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా జిల్లా కలెక్టర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి ఆదేశాల మేరకు మార్చి 25న వెల్గటూర్ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో ప్రత్యేక వైద్యులచే ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు పి హెచ్ సి మెడికల్ ఆఫీసర్ తేజస్విని తెలిపారు బుధవారం ఉదయం 9 గంటల నుండి జనరల్ మెడిసిన్ గైనకాల జీ, చిల్డ్రన్ డెంటల్ ఆర్థోపెడిక్ కంటి స్పెషలిస్ట్ వైద్యులు అందుబాటులో ఉంటారని ప్రభుత్వ ఉచిత వైద్య శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రజలను కోరారు ఈ కార్యక్రమంలో పి హెచ్ సి సిబ్బంది తదితరులు ఉన్నారు.

## పాలమూరు యూనివర్సిటీ ఖో ఖో జట్టు కోచ్గా చెన్నారం వెంకటప్ప

**వాస్తవ తెలంగాణ:** వికారాబాద్ జిల్లా కొడంగల్ క్రైమ్ ప్రతినిధి మార్చి 24 పాలమూరు యూనివర్సిటీ ఖో ఖో జట్టు మంగళవారం కర్ణాటక రాష్ట్రంలోని దావనగిరికి బయలుదేరింది. ఆల్ ఇండియా సౌత్ జోన్ ఖో ఖో టోర్నమెంట్ ఈ నెల 26 నుండి 29 వరకు నిర్వహించబడనుండగా ఈ పోటీల్లో పాల్గొనేందుకు జట్టు సిద్ధమైంది. ఈ జట్టుకు కోచ్‌గా చెన్నారం వెంకటప్ప వ్యవహరించనున్నారు. చెన్నారం వెంకటప్ప ప్రస్తుతం మద్దూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఫిజికల్ డైరెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. ఆయన కోచ్‌గా నియామకం కావడం పట్ల మద్దూరు మరియు నిడ్జింత మండల విద్యాధికారులు బాలకిష్టప్ప, ఆంజనేయులు, రాష్ట్ర భాషోపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు యశ్వంత్, పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు సవితతో పాటు ఉపాధ్యాయ బృందం హర్షం వ్యక్తం చేస్తూ అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా జట్టు సభ్యులు ఉత్తమ ప్రదర్శన చేసి విజయం సాధించాలని వారు ఆకాంక్షించారు.





# నియోజకవర్గాల.. పునర్విభజన!

## 816కు పెరగనున్న లోక్‌సభ స్థానాలు

- ఈ సెషన్‌లోనే పునర్విభజన బిల్లు
- వేగంగా అడుగులు వేస్తున్న కేంద్రం
- వామపక్ష, ఎన్డీఏ కూటమి పార్టీలతో చర్చలు
- కాంగ్రెస్ పార్టీతో మాట్లాడనున్న అమిత్ షా
- 2011 జనాభా ప్రతిపాదికన 50శాతం సీట్లు పెంపు
- 816కు పెరగనున్న లోక్‌సభ సీట్లు
- అసెంబ్లీల సీట్లు 4,123 నుంచి 6,185 పెరుగుదల
- లోక్‌సభ, అసెంబ్లీలో 33% మహిళలకు రిజర్వేషన్
- ఏపీ అసెంబ్లీలో 263, తెలంగాణలో 179కి పెరిగే చాన్స్
- తెలంగాణలో 26, ఏపీలో 38 లోక్‌సభ సీట్లు పెరిగే అవకాశం

**వాస్తవ తెలంగాణ:** దేశ రాజకీయాల్లో కీలక మార్పులకు దారితీసే దిశగా కేంద్ర ప్రభుత్వం అడుగులు వేస్తోంది. లోక్‌సభ, రాష్ట్ర అసెంబ్లీ స్థానాలను 50శాతం పెంచాలని నిర్ణయం తీసుకుంది. దీనికి సంబంధించిన బిల్లును ఈ పార్లమెంటు సమావేశాల్లోనే ప్రవేశపెట్టడానికి సిద్ధమైంది. దీని ప్రకారం.. ప్రస్తుతం ఉన్న 543 లోక్‌సభ స్థానాలు 816కి పెరగనున్నాయి. ఇదే విధంగా దేశవ్యాప్తంగా అసెంబ్లీ స్థానాలు కూడా 4,123 నుంచి 6,185కు పెరుగుతాయి. అటు లోక్ సభలోనూ, ఇటు అసెంబ్లీలోనూ 33 శాతం సీట్లు మహిళల కోసం రిజర్వ్ చేస్తారు. ఈ ప్రతిపాదనలో భాగంగా తెలుగు రాష్ట్రాలైన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో లోక్‌సభ, అసెంబ్లీ స్థానాలు గణనీయంగా పెరగనున్నాయి. తెలంగాణలో ప్రస్తుతం ఉన్న 17 లోక్‌సభ స్థానాలు 26కు.. అసెంబ్లీ స్థానాలు 119 నుంచి 179కి పెరగనున్నాయి. అదే విధంగా ఆంధ్రప్రదేశ్‌లో లోక్‌సభ స్థానాలు 25 నుంచి 38కి.. అసెంబ్లీ స్థానాలు 175 నుంచి 263కు చేరే అవకాశం ఉంటుంది.

### ఈ పార్లమెంట్ సెషన్‌లోనే...

ఈ ప్రతిపాదనను అమలు చేయడానికి అవసరమైన బిల్లును ప్రస్తుత పార్లమెంట్ సమావేశాల్లోనే ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయని సమాచారం. అన్ని రాజకీయ పార్టీల మద్దతుతో ఈ బిల్లును ఆమోదింపజేయాలని కేంద్రం భావిస్తోంది. 2029 సాధారణ ఎన్నికల నుంచే ఈ కొత్త వ్యవస్థ అమలులోకి వచ్చే అవకాశం ఉంది. జనాభా ఆధారంగా ప్రతినిధిత్వాన్ని పెంచడం, ప్రజల సమస్యలను మరింత సమర్థవంతంగా ప్రతిబింబించడం కోసం కేంద్ర ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంటున్నట్లు చెబుతున్నారు.


### 2011 జనాభా లెక్కలనే ప్రాతిపదికగా

దేశంలో లోక్‌సభ, శాసనసభ స్థానాల పునర్విభజనకు 2011 జనాభా లెక్కలనే ప్రాతిపదికగా తీసుకోవాలని నిర్ణయించింది. ఇదే సమయంలో దేశంలో లోక్‌సభతోపాటు 28 రాష్ట్రాలలో శాసనసభ స్థానాలను గంపగుత్తగా 50 శాతం పెంచాలని నిర్ణయించింది.. అందులో 33 శాతం స్థానాలను మహిళలకు రిజర్వేషన్ చేయనుంది. నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే సార్వత్రిక ఎన్నికలను కేంద్ర ఎన్నికల సంఘం నిర్వహించనుంది. పునర్విభజన తర్వాత దేశంలో లోక్‌సభ స్థానాలు 543 నుంచి 816కు పెరగనున్నాయి. ఇందులో మహిళలకు 33 శాతం అంటే 270 స్థానాలను రిజర్వేషన్ చేయనున్నారు.

### పెరగనున్న లోక్‌సభ సీట్లు

ఈ కొత్త ప్రతిపాదన అమలైతే రాష్ట్రాల వారీగా లోక్‌సభ సీట్ల సంఖ్య గణనీయంగా పెరుగుతుంది. ఉదాహరణకు, ఉత్తరప్రదేశ్‌లో 80 నుంచి 120కి, బీహార్‌లో 40 నుంచి 60కి, కేరళలో 20 నుంచి 30కి సీట్లు పెరుగుతాయి. అలాగే ఏపీలో 25 నుంచి 38కి, తెలంగాణలో 17 నుంచి 26కి పెరుగుతాయి. జనాభా నియంత్రణ పాటించడం వల్ల తమ ప్రాతినిధ్యం తగ్గుతుందని ఆందోళన చెందుతున్న దక్షిణాది రాష్ట్రాల అనుమానాలను నివృత్తి చేసేందుకే, అన్ని రాష్ట్రాల్లో దామాషా ప్రకారం 50% సీట్లు పెంచుతున్నట్లు ప్రభుత్వం వివరించింది. ఎస్సీ, ఎస్టీ రిజర్వ్డ్ స్థానాలు కూడా ఇదే నిష్పత్తిలో 84 నుంచి 126కి, 47 నుంచి 70కి పెరుగుతాయి. ఇక రాష్ట్రంలో ఒక్కో శాసనసభ స్థానం పరిధిలో సగటున 1.60 లక్షల మంది ఓటర్లు ఉంటారనే అంచనాలున్నాయి.





### రంగంలోకి అమిత్ షా..

ఎన్డీయే సమావేశంలో కేంద్ర ప్రభుత్వం వామపక్ష పార్టీలకు వెల్లడించినట్లు తెలుస్తోంది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా, పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు, న్యాయశాఖ మంత్రి అర్జున్‌రామ్ మేఘ్‌వాల్ నేతృత్వంలో జరిగిన భేటీలో ఈ నిర్ణయంపై మిత్రపక్షాలకు వివరించారు. ఇదే సమయంలో కాంగ్రెసేతర విపక్షాలతోనూ విడిగా ఎన్డీఏ ప్రతినిధుల సమావేశమై ఈ నిర్ణయాన్ని ప్రకటించి మద్దతు ఇవ్వవలసిందిగా కోరినట్టు తెలుస్తోంది. ఇక.. కాంగ్రెస్ పార్టీతోనూ అమిత్ షా స్వయంగా మాట్లాడనున్నారు.

### ఎస్సీ, ఎస్టీలకు..

దేశంలో ప్రస్తుతం ఎస్సీ రిజర్వుడ్ లోక్‌సభ సీట్లు 84 ఉన్నాయి. ఎస్టీ వర్గాలకు సంబంధించి రిజర్వుడు లోక్‌సభ స్థానాలు 47 ఉన్నాయి. నియోజకవర్గాల పునర్విభజనతో సీట్ల పెంపు నేపథ్యంలో అదే దామాషాలో వారి సీట్లు పెరగనున్నాయి. ఎస్సీ, ఎస్టీ ఓటర్లు గరిష్టంగా ఉన్న చోట ఆయా వర్గాలకే సీట్లు కేటాయించనున్నారు. ఈ సామాజిక వర్గాలకు అసెంబ్లీ స్థానాలు కూడా అదే నిష్పత్తిలో పెరగనున్నాయి.

### ఇది ఐదోసారి...

దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక నియోజకవర్గాల పునర్విభజనను గతంలో నాలుగు సార్లు (1952, 1963, 1973, 20022008) కేంద్ర ప్రభుత్వం చేపట్టింది. ప్రస్తుతం చేపట్టే నియోజకవర్గాల పునర్విభజన ఐదోది కావడం గమనార్హం. చట్టసభల్లో మహిళలకు 33% రిజర్వేషన్ కల్పించే బిల్లును 2023లో పార్లమెంటు ఆమోదించింది. మహిళలకు చట్టసభల్లో 33% రిజర్వేషన్ కల్పిస్తూ (ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్‌తో కలిపి) 128వ రాజ్యాంగ సవరణ చేసింది. ఈ నేపథ్యంలో వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో మహిళా రిజర్వేషన్‌ను అమలు చేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

### 50% పెంపు

దేశంలో ప్రస్తుతం ఉన్న లోక్‌సభ, శాసనసభ స్థానాలను గంపగుత్తగా 50% పెంచాలని నిర్ణయించింది. ఆ మేరకు లోక్‌సభ, శాసనసభ స్థానాలను పెంచుతూ నియోజకవర్గాల పునర్విభజన చేపట్టే బిల్లును పార్లమెంటు రెండింట మూడొంతుల మెజార్టీతో ఆమోదించాల్సి ఉంటుంది. ఆ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెట్టి ఆమోదింపజేసేందుకు అన్ని రాజకీయ పార్టీలతో కేంద్ర ప్రభుత్వం సంప్రదింపులు జరుపుతోంది. ఈ ప్రక్రియ పూర్తయ్యాక ప్రస్తుత సమావేశాల్లోగానీ లేదా వర్షాకాల సమావేశాలు లేదంటే ప్రత్యేక సమావేశాలు నిర్వహించి పార్లమెంటులో ఆ బిల్లును ప్రవేశపెట్టాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించింది.

### ఏపీ, తెలంగాణలో..

ఏపీలో ప్రస్తుతం లోక్‌సభ స్థానాలు 25 ఉన్నాయి. నియోజకవర్గాల పునర్విభజనతో 50% అంటే 12.5 స్థానాలు పెరగాలి.. కానీ, 50% స్థానాలు పెంచేటప్పుడు 12.4 స్థానాలు వస్తే.. దాన్ని 12గానే పరిగణించి స్థానాలు పెంచుతారు. అదే 12.6 స్థానాలు వస్తే.. దాన్ని 13 స్థానాలుగా పరిగణించి పెంచుతారు. ఈ నేపథ్యంలో ఏపీలో 12.5 స్థానాలు వస్తే లాటరీ వేస్తారు. ఆ లాటరీలో రాష్ట్రానికి అనుకూలంగా ఫలితం వస్తే 13 స్థానాలు.. ప్రతికూలంగా వస్తే 12 స్థానాలనే పెంచుతారు. ఈ నేపథ్యంలో నియోజకవర్గాల పునర్విజన తర్వాత రాష్ట్రంలో లోక్‌సభ స్థానాలు 25 నుంచి 37 లేదా 38కి పెరుగుతాయి. ఇందులో 33% అంటే 12 లేదా 13 స్థానాలు మహిళలకు రిజర్వేషన్ చేస్తారు. ఇక రాష్ట్రంలో ప్రస్తుతం 175శాసనసభ స్థానాలు ఉన్నాయి. నియోజకవర్గాల పునర్విభజన తర్వాత అసెంబ్లీ సీట్లు 262 లేదా 263కు పెరుగుతాయి. అందులో 33% అంటే 86 లేదా 87 స్థానాలను మహిళలకు రిజర్వేషన్ చేస్తారు. ఇక.. తెలంగాణలో ప్రస్తుతం 119 అసెంబ్లీ స్థానాలు, 17 లోక్ సభ స్థానాలున్నాయి. తాజా నిర్ణయంతో అసెంబ్లీకి 179 స్థానాలు, లోక్‌సభకు 26 సీట్లు పెరిగే అవకాశం ఉంది.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయండి: జిల్లా కలెక్టర్ ప్రావీణ్య



**గుమ్మడిదల,వాస్తవ తెలంగాణ న్యూస్:** జిల్లా కలెక్టర్ ప్రావీణ్య మంగళవారం గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామంలోని ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను పరిశీలించారు. లబ్ధిదారులతో మాట్లాడి నాణ్యత, సదుపాయాలపై ఆరా తీశారు. బిల్లులు సకాలంలో చెల్లించేలా చర్యలు తీసుకోవాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఇందిరమ్మ జిల్లా నిర్మాణాలను వేగవంతం చేయాలని ఆమె సూచించారు.

## రాష్ట్రస్థాయి పోటీలలో మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థుల ప్రతిభ




**వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్ ప్రతినిధి (ఆంజనేయులు)**హైదరాబాదులోని రాష్ట్రపతి నిలయంలో ఈరోజు జరిగిన ఉపన్యాస మరియు నినాదాల పోటీలలో మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థులు రెండు బహుమతులు సాధించినట్లు కళాశాల ఇన్చార్జి ప్రిన్సిపల్ సింహారెడ్డి తెలిపారు.రాష్ట్రపతి భవన్ లో జరిగిన రాష్ట్రస్థాయి ఉపన్యాస పోటీలో కళాశాలకు బీ జెడ్ సి ఎస్ తృతీయ సంవత్సరం చదువుతున్న పూనం రాజ్ పురోహిత్ అను విద్యార్థిని తృతీయ బహుమతిని సాధించినట్లు తెలిపారు. సేవ్ వాటర్ అండ్ జెండర్ అను అంశము పైన ఇచ్చిన ఉపన్యాసానికి గాను ఈ బహుమతి లభించింది. మరొక అంశం స్లోగన్స్ పోటీలో కళాశాలలో ఎంపీసీ మొదటి సంవత్సరం చదువుతున్న అభినయ్ అను విద్యార్థికి ప్రత్యేక బహుమతి లభించినట్టు తెలిపారు. ఈ బహుమతులను రాష్ట్రపతి భవన్ లోని అధికారుల చేతుల మీదుగా పొందినట్టు విజేతలు పూనం రారాజ్ పురోహిత్ మరియు అభినయ్ తెలిపారు. ఈ విధంగా కళాశాల విద్యార్థులు రాష్ట్రస్థాయి పోటీలలో బహుమతులు సాధిస్తున్నందుకు కళాశాల అధ్యాపకులు విద్యార్థులను అభినందించారు

## ఆవిష్కరణకు సిద్ధమైన పంచముఖ హనుమాన్ విగ్రహం



**గడ్డపోతారం,వాస్తవ తెలంగాణ న్యూస్:** సంగారెడ్డి జిల్లా గడ్డపోతారం మున్సిపాలిటీ పరిధిలో 42 అడుగుల పంచముఖ హనుమాన్ విగ్రహాన్ని రూపొందిస్తున్నారు. ఈనెల 25వ తేదీ నుంచి మూడు రోజులపాటు విగ్రహావిష్కరణ కార్యక్రమాలు జరుగుతాయని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి మెదక్ ఎంపీ రఘునందన్ రావు, ఎమ్మెల్యే మహిపాల్ రణెడ్డి హాజరవుతారని నిర్వాహకులు పేర్కొన్నారు

## ప్రభుత్వ డిగ్రీ కళాశాల జాబ్ మేళాలో 21 మంది ఎంపిక




**వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్ ప్రతినిధి (ఆంజనేయులు)** మంగళవారం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మెదక్ లో టి ఎస్ కే సి మరియు కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్మెంట్ సెల్ ఆధ్వర్యంలో ఎంఎస్ఎన్ ఫార్మసీ అమెజాన్ మరియు ఫ్లిప్కార్ట్ కంపెనీలకు జాబ్ డ్రైవ్ జరిగిందని ఇంచార్జి ప్రిన్సిపల్ సింహారెడ్డి తెలిపారు. ఈ జాబ్ డ్రైవ్ కు 42 మంది అభ్యర్థులు హాజరయ్యారు 6 గురు ఎంఎస్ఎన్ కంపెనీకి మరియు 15 మంది అమెజాన్ మరియు ఫ్లిప్కార్ట్ లకు షార్ట్ లిస్ట్ అయ్యారు. ఈ కార్యక్రమంలో టిఎస్కేసి మరియు కెరీర్ గైడెన్స్ అండ్ ప్లేస్మెంట్ సెల్ కోఆర్డినేటర్ అసోసియేట్ ప్రొఫెసర్ వై ప్రవీణ్ కుమార్ గారు ఐక్యుఎసి కోఆర్డినేటర్ డాక్టర్ తిరుమల్ రెడ్డి మాట్లాడుతూ ఇప్పుడున్న కాలంలో ఉద్యోగం యొక్క ఆవశ్యకతను మరియు ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో రసాయన శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ రమణ కుమార్ మాట్లాడుతూ సైన్స్ విద్యార్థులకు ఫార్మసీ కంపెనీలలో ఉద్యోగ అవకాశాలు మెండుగా ఉన్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో బి శ్రీనివాస్ వేణుగోపాల్ రావు, కిరణ్ కుమార్, టీ ఎస్ కె సి మెంటార్ ఉగ్గి అంజయ్య మరియు ఇతర అధ్యాపకులు పాల్గొన్నారు.

## షాపూర్ నగర్ మార్కెట్‌లో క్షయ వ్యాధి పై అవగాహన సదస్సు...ముఖ్యఅతిథిగా పుప్పాల భాస్కర్



**కుత్బుల్లాపూర్, వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు....** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, షాపూర్ నగర్ డివిజన్ పరిధిలోని మార్కెట్ ప్రాంతంలో మంగళవారం క్షయ వ్యాధి (టీబీ) నివారణపై ప్రత్యేక అవగాహన సదస్సు నిర్వహించారు. జిహెచ్ఎంసి డివిజన్ బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షులు పుప్పాల భాస్కర్ ఆధ్వర్యంలో, మల్లారెడ్డి నర్సింగ్ ఇన్స్టిట్యూషన్స్ వారి సౌజన్యంతో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా పుప్పాల భాస్కర్ మాట్లాడుతూ.. సమాజంలో క్షయ వ్యాధి పట్ల ప్రజలకు సరైన అవగాహన ఉండాలని, లక్షణాలు కనిపించిన వెంటనే వైద్యులను సంప్రదించి చికిత్స పొందాలని సూచించారు. మల్లారెడ్డి నర్సింగ్ కాలేజీ విద్యార్థులు ఈ కార్యక్రమంలో చురుగ్గా పాల్గొని, ఒక ప్రదర్శన (స్కిట్) ద్వారా క్షయ వ్యాధి ఎలా వ్యాపిస్తుంది, దాని నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు మరియు పౌష్టికాహారం ప్రాముఖ్యతను ప్రజలకు కళ్ళకు కట్టినట్లు వివరించారు. టీబీ వ్యాధిని ప్రాథమిక దశలోనే గుర్తించడం వల్ల ప్రాణాపాయం తప్పుతుందని విద్యార్థులు వివరించారు.నర్సింగ్ విద్యార్థుల స్కిట్ మార్కెట్‌కు వచ్చిన ప్రజలను విశేషంగా ఆకట్టుకుంది. ఈ కార్యక్రమంలో నర్సింగ్ కాలేజీ ఇంచార్జి డాక్టర్ బాలసుబ్రమణ్యం , అరుణ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు సత్యనారాయణ ముకుంద రావు, రవికుమార్ , సాజిద్, సంజీవ షాబుద్దీన్ జుబేర్ విద్యార్థులు, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

## జిల్లా సమగ్రాభివృద్ధికి బడ్జెట్ లో నిధులు కేటాయింపు పెంచాలి

**భూ సమస్యలు, రోడ్లు,ఇండ్లు,ఇండ్ల స్థలాల సమస్యలు, ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలి**

**కలెక్టర్ కార్యాలయం పరిపాలన అధికారికి వినతి పత్రం అందజేత**




**వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్** మెదక్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయం ముందు ధర్నాలో సీ.పి.ఎం.రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.ఆడి వయ్య పిలుపు.ఉద్యమాల ద్వారానే సమస్యలు పరిష్కారం అవుతాయని సి.పి.ఎం.రాష్ట్ర కమిటీ సభ్యులు ఎం.ఆడివయ్య పిలుపు నిచ్చారు.మెదక్ జిల్లాలో ప్రజా సమస్యల పరిష్కారం విషయంలో జిల్లా అధికార యంత్రాంగం అలసత్వం వహిస్తుందని విమర్శించారు.జిల్లాలో భూ సమస్యలు,అభివృద్ధి అనగా రోడ్ల మరమ్మతులు,నూతన రోడ్ల నిర్మాణం,డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల కేటాయింపు , ఉపాధి హామీ సమస్యలు సంవత్సరం క్రితం జిల్లా అధికారులకు వినతిపత్రం సమర్పించగా ఎలాంటి నిర్దిష్ట చర్యలు తీసుకోలేదని విమర్శించారు.పేరుకు జిల్లా కేంద్రం ఏర్పడినా మెదక్ ఎలాంటి అభివృద్ధి ప్రగతికి నోచుకోలేదన్నారు.మెదక్, హవేలీ ఘనపూర్,వెల్దుర్తి, టేక్మాల్,రేగోడ్,నిజాంపేట, రామాయంపేట,శివంపేట, చిలప్ చేడ్ మండలాల్లో రోడ్లు అన్ని పూర్తి అధ్వాన్నంగా ఉన్నాయని అన్నారు.ఉపాధి హామీ పథకంలో కేంద్ర ప్రభుత్వం చేసిన చట్ట సవరణ వల్ల పేదలు కూలి పనికి దూరం అవుతున్నారని అన్నారు.రెండు పూటల పోటో పద్ధతి ద్వారా అటవీ ప్రాంతాల్లో సిగ్నల్స్ లేక చేసిన పని ఆన్ లోకి రాకపోవడం ద్వారా కూలీలు పనికి రావడం మానేస్తున్నారని అన్నారు.చేసిన పనికి సైతం వేతనం సకాలంలో చెల్లించడం లేదని విమర్శించారు.మార్కెట్లో నిత్యావసర సరుకులు జెట్ స్పీడ్ లో పెరిగితే ఉపాధి హామీ రోజు వారి కూలీ పెంచడం లేదని విమర్శించారు.ఇప్పటి జిల్లా లో సగం గ్రామాల్లో కూడా పనులు ప్రారంభించలేదని విమర్శించారు.ఇప్పటికైనా ఉపాధి హామీ పథకాన్ని పాత పద్ధతిలో ఏం.ఎన్.ఆర్. ఇ.జి.ఎన్.గా కొనసాగించా లని,రోజు కూలీ రూపాయలు 800 కు పెంచుతూ, సంవత్సరంలో 200 రోజుల కూలీ పనులు కల్పించాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆడివయ్య డిమాండ్ చేసారు.జిల్లాలో భూ సమస్యలు పరిష్కారం కాక ప్రజలు రెవెన్యూ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ విసిగి పోతున్నారన్నారు.ఘనపురం ఆనకట్ట ఎత్తు పెంపు పేరుతో పాపన్నపేట మండల పరిధిలోని నాగ్సానిపల్లి శివారులోని రైతుల భూమి బ్లాక్ లిస్టులో పెట్టారని విమర్శించారు.చేగుంట మండలం చిట్టోజిపల్లి గ్రామ శివారులోని సర్వే నంబర్ 266/1 లో 755 ఎకరాల భూమి 1954,55 ఖస్ర పహానీలో ప్రభుత్వ భూమి గా ఉండగా రికార్డు తారుమారు చేసి కొంత భూదాన్ భూమి గా మరికొంత సీలింగ్ భూమి గా మార్చి పేదకు పట్టా సర్టిఫికెట్లు ఇచ్చారన్నారు.అట్టి భూమి ప్రైవేట్ వ్యక్తులది గా చెపుతూ రైతులను బలవంతంగా భూమి నుండి దూరం చేస్తున్నారని విమర్శించారు. హవేలీ ఘనపురం మండలం షమ్నాపూర్ గ్రామంలో గొర్రెల కాపరులు పాకలు నిర్మించుకోగా ఫారెస్ట్ అధికారులు కూల్చివేసే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు.జిల్లాలో కొంగోడు,చిట్టోజిపల్లి, షమ్నాపూర్ లో కాస్తులో ఉన్న రైతులకు పట్టా సర్టిఫికెట్స్ ఇవ్వాలని సి.పి.ఎం.పార్టీ డిమాండ్ చేస్తుంద న్నారు. చేగుంట మండల కేంద్రంలో శివంపేట మండలం దొంతిలో డబుల్ బెడ్ రూమ్ ఇండ్లలో నివాసం ఉంటున్న వారికి పొసిషన్ సర్టిఫికెట్స్ ఇవ్వాలని, నర్సాపూర్ నిర్మాణం పూర్తి అయిన డబుల్ బెడ్ రూమ్స్, మెదక్,రామాయంపేటలో మిగిలిన ఇండ్లు పేదలకు కేటాయించాలని ధర్నా సందర్భంగా డిమాండ్ చేస్తున్నామన్నారు.ఇప్పటికే కేటాయించిన డబుల్. బెడ్ రూం ఇండ్లలో సౌకర్యాలు మెరుగు పరచాలని డిమాండ్ చేసారు.ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ ప్రకారం చేయూత పింఛను 4000 చెల్లిస్తామని ఇచ్చిన హామీ ప్రకారం తక్షణమే విడుదల చేయాలని,కొత్తగా దరఖాస్తు చేసుకున్న వారికి చేయూత పింఛన్లు మంజూరు చేయాలని డిమాండ్ చేసారు.ప్రభుత్వ ఆసు పత్రుల్లో ఉన్న డాక్టర్,ఇతర సిబ్బంది ఖాళీలు భర్తీ చేయాలని, ప్రభుత్వ శాఖల్లో అన్ని రకాల ఉద్యోగ పోస్టులు భర్తీ చేయాలని డిమాండ్ చేశారు.ధర్నా అనంతరం కలెక్టర్ కార్యాలయ పరిపాలన అధికారి యూనుస్ కు వినతి పత్రం సమర్పించారు.ఈ కార్యక్రమంలో సి.పి.ఎం పార్టీ జిల్లా కార్యదర్శి కే.నరసమ్మ, వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు బి.పద్మ,సి.పి.ఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏ.మల్లేశం,కే.మల్లేశం,జిల్లా కమిటీ సభ్యులు కే.నాగరాజు, గౌరయ్య,సంతోష్, అజయ్,నరేందర్,దేవయ్య, శౌకత్,వెంకట్,వసంత, తదితరులు పాల్గొన్నారు.

## వర్షాధారిత పథకంతో రైతులకు ఆధునిక సాయం

## నల్లవల్లిలో జిల్లా కలెక్టర్ ప్రావీణ్య క్షేత్ర పర్యటన



**సంగారెడ్డి,వాస్తవ తెలంగాణ న్యూస్ మార్చి 24:-** వర్షాధారిత పథకంతో రైతులు సమగ్ర వ్యవసాయ పద్ధతులు అవలంబించి అధిక దిగుబడులు, ఆదాయం సాధించాలని జిల్లా కలెక్టర్ ప్రావీణ్య సూచించారు. గుమ్మడిదల మండలం నల్లవల్లి గ్రామంలో అమలవుతున్న వర్షాధారిత అభివృద్ధి పథకాన్ని జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య మంగళవారం పరిశీలించి, రైతులకు అందిస్తున్న ఆధునిక పరికరాలు, రాయితీల వినియోగాన్ని క్షేత్ర స్థాయిలో సమీక్షించారు. ఈ సందర్భంగా రైతు కూర్మ కొమురయ్య కూరగాయల పొలాన్ని పరిశీలించి, పథకం కింద అందించిన వ్యవసాయ పరికరాల వినియోగాన్ని క్షేత్ర స్థాయిలో పరిశీలించారు.ఈ పథకం ద్వారా రైతులు పొందుతున్న లాభాలను కలెక్టర్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ,ఆధునిక వ్యవసాయ పద్ధతులను అనుసరించడం ద్వారా అధిక దిగుబడులు, ఆదాయాన్ని పెంచుకోవచ్చని సూచించారు. వర్షాధారిత అభివృద్ధి పథకం కింద మొత్తం 115 మంది లబ్ధిదారులకు సుమారు రూ.32.10 లక్షల విలువైన రాయితీలు మరియు వ్యవసాయ పరికరాలు అందజేసినట్లు తెలిపారు. ఇందులో ప్లాస్టిక్ క్రేట్లు, వర్మీ బెడ్స్, తేనెటీగల పెంపక బాక్సులు వంటి పరికరాలు ఉన్నాయని తెలిపారు.రైతులు సమగ్ర వ్యవసాయ పద్ధతులను అవలంబిస్తూ అధిక లాభాలను సాధించాలని కలెక్టర్ సూచించారు. అలాగే రైతు ఉత్పత్తిదారుల సంఘాలు ఏర్పాటు చేసుకొని, సమిష్టిగా పంటల విక్రయం చేయడంతో పాటు విలువ ఆధారిత ఉత్పత్తులను మార్కెటింగ్ చేయాలని సూచించారు. ప్రభుత్వ పథకాలను సమీకృతంగా వినియోగించుకుంటే రైతులకు మరింత ప్రయోజనం చేకూరుతుందని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యాన అధికారి పి. సోమేశ్వరరావు, మండల ప్రజా పరిషత్ అభివృద్ధి అధికారి ఉషారాణి, మండల రెవెన్యూ అధికారి పరమేశ్వర్, ఉద్యాన అధికారులు మౌనిక, అనూష, వ్యవసాయ అధికారి, హెచ్ఈఓలు విట్టల్, స్వామి, ఏఈ హౌసింగ్, సర్పంచ్ రాణి సురేష్, గ్రామ రైతులు పాల్గొన్నారు.

## తూప్రాన్‌లో నేటి నుంచి శ్రీ సీతారాముల స్వామి జాతర

## బ్రహ్మోత్సవాలు రాముల గడ్డ పై ఆధ్యాత్మిక ఉత్సవ వైభవం





**వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్ ప్రతినిధి (ఆంజనేయులు)** తూప్రాన్ పట్టణం ఆధ్యాత్మిక కాంతులతో కళకళలాడుతోంది. హాల్దీ పరివాహక ప్రాంతంలో స్వయంభువుగా వెలసిన శ్రీశ్రీశ్రీ సీతారాముల వారి దేవస్థానంలో నేటి నుండి ఏప్రిల్ 4వ తేదీ వరకు నిర్వహించబడనున్న శ్రీ సీతారాముల జాతర బ్రహ్మోత్సవాలు ఘనంగా ప్రారంభం కానున్నాయి. ఈ మహోత్సవాల సందర్భంగా పట్టణమంతా భక్తి భావంతో నిండిపోగా, ఆలయ ప్రాంగణం పూలతోరణాలు, దీపాలతో అలంకరించి ఆధ్యాత్మిక వాతావరణాన్ని సృష్టించారు.ఈ ఉత్సవాల ఏర్పాట్లను పర్యవేక్షిస్తూ మున్సిపల్ చైర్‌పర్సన్ శ్రీమతి బొంది రజిని రవీందర్ గౌడ్ ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం జరిగింది. ఈ సందర్భంగా స్వామివారి కల్యాణ లగ్న పత్రికను పురోహితులు శ్రీ ఆత్రేయ శర్మ గారు శాస్త్రోక్తంగా రచించి, గ్రామస్తులు మరియు పనిబాటల వారి సమక్షంలో చదివి వినిపించారు.మార్చి 25 నుండి ఏప్రిల్ 4 వరకు కొనసాగనున్న ఈ బ్రహ్మోత్సవాల్లో ప్రతిరోజు వివిధ ఆధ్యాత్మిక కార్యక్రమాలు, పూజలు, హోమాలు, ఊరేగింపులు భక్తులను అలరిస్తాయి. ముఖ్యంగా మార్చి 27, శుక్రవారం నాడు నిర్వహించనున్న శ్రీ సీతారాముల కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా జరగనుందని నిర్వాహకులు తెలిపారు. ఈ పవిత్ర వేడుకను దర్శించేందుకు పరిసర గ్రామాల నుండి వేలాది మంది భక్తులు తరలివచ్చే అవకాశం ఉంది.భక్తి, సంప్రదాయం, సామూహిక ఐక్యతకు ప్రతీకగా నిలిచే ఈ శ్రీ సీతారాముల జాతర బ్రహ్మోత్సవాలు తూప్రాన్ పట్టణానికి ఆధ్యాత్మిక వైభవాన్ని తీసుకురానున్నాయి. ఈ సమావేశంలో వైస్ చైర్మన్ సమత కాశిరెడ్డి, కౌన్సిలర్లు భైరం సత్యలింగం, చెలిమెల రాములు, జైపాల్ రాథోడ్, ఐలేష్ యాదవ్, పురోహితులు మనోహర్ పంతులు, గ్రామ పెద్దలు మరియు పనిబాటల వారు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాల విజయవంతం కోసం తమ వంతు సహకారం అందించారు.

# మెదక్ మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా అంతర్జాతీయ మహిళా దినోత్సవం ముఖ్యఅతిథి జిల్లా సంక్షేమ అధికారిని హేమ భార్గవి



**వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్** మెదక్ మండల పరిషత్ కార్యాలయంలో తెలంగాణ ఆల్ సీనియర్ సిటిజన్ సంఘం (టాస్కా) ఆధ్వర్యంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా సంక్షేమ అధికారిణి శ్రీమతి హేమ భార్గవి ముఖ్య అతిథిగా విచ్చేశారు.?ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉమ్మడి కుటుంబ వ్యవస్థలోని విశిష్టతను కొనియాడుతూ, మహిళలు ఆర్థిక,సామాజిక, రాజకీయ రంగాల్లో రాణించాలని పిలుపు నిచ్చారు.ముఖ్య నిర్ణయాల్లో మహిళల భాగస్వామ్యం అవసరమని పేర్కొన్నారు. టాస్కా జిల్లా అధ్యక్షులు శివ కృష్ణమూర్తి అధ్యక్షతన జరిగిన ఈ సభలో రాష్ట్ర కార్యదర్శి టి.రాజేశ్వర్, మండల పరిషత్ అధికారిణి లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.అనంతరం మహిళా అధికారులను, విచ్చేసిన మహిళలను ఘనంగా సన్మానించారు.

# ముఖ్యమంత్రి సహాయ నిధిలి CMRF] చెక్కులను పంపిణీ చేసిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు కూన శ్రీశైలం గౌడ్



**కుత్బుల్లాపూర్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు.....** కుత్బుల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని వివిధ ప్రాంతాలకు చెందిన ఎనిమిది మందికి మంజూరైన నాలుగు లక్షల యాభై వేల(4,50,000) విలువైన చెక్కులను మంగళవారం షాపూర్ నగర్ లోని నివాసంలో అనారోగ్యం కారణంగా చికిత్స చేయించుకున్న రాజేష్ కుమార్, లావు సప్న, శ్రీలేఖ, ముద్దుల బాబు, మహమ్మద్ హుస్సేన్, మాధవి, చిన్న స్వామి, విశాలాక్షి గార్లకు మంజూరైన చెక్కులను మంగళవారం కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు మాజీ శాసనసభ్యులు కూన శ్రీశైలం గౌడ్ పంపిణీ చేశారు...ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి ళిజవీ=ఖీరి అనేది నిరుపేదలకు ఆర్థిక అవసరాన్ని తీర్చే ఒక గొప్ప కార్యక్రమం అని తెలియజేశారు, నియోజకవర్గం పరిధిలో నిరుపేదలు అనారోగ్యం బారిన పడి చికిత్స చేయించుకున్నట్లయితే వాటికి సంబంధించిన రసీదులను తమ సిబ్బందికి అందజేసి ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి నిధులు మంజూరుకు కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మాజీ ప్రజా ప్రతినిధులు మరియు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు..

# లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి - ఎస్పీ. . శ్రీనివాస రావు




**వాస్తవ తెలంగాణ న్యూస్ మెదక్ ప్రతినిధి (ఆంజనేయులు )**మెదక్: ఈ నెల 28వ తేదీన నిర్వహించనున్న జాతీయ మెగా లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా ఎస్పీ డి.వి. శ్రీనివాసరావు, ఐపీఎస్ తెలిపారు. ఈ లోక్ అదాలత్ ద్వారా పెండింగ్‌లో ఉన్న వివాదాలను సులభంగా, వేగంగా పరిష్కరించుకునే అవకాశం కలుగుతుందని ఆయన పేర్కొన్నారు.ఎస్పీ .మాట్లాడుతూ, క్రిమినల్ కంపౌండబుల్ కేసులు, సివిల్ తగాదాలు, ఆస్తి విభజన, కుటుంబపరమైన వివాదాలు, వైవాహిక సమస్యలు, బ్యాంకు రికవరీ కేసులు, విద్యుత్ చౌర్యం, చెక్ బౌన్స్ వంటి కేసుల్లో ఇరువర్గాలు పరస్పరం చర్చించుకుని రాజీకి రావచ్చని తెలిపారు. దీని ద్వారా కోర్టు విచారణలు, దీర్ఘకాల న్యాయ ప్రక్రియల వల్ల కలిగే ఇబ్బందులను నివారించవచ్చన్నారు.చిన్న చిన్న వివాదాలపై కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోవడం కంటే రాజీ ద్వారా సమస్యలను పరిష్కరించుకోవడం ఉత్తమ మార్గమని ఆయన సూచించారు. "రాజీయే రాజమార్గం" అని పేర్కొంటూ, జుడీషియల్ శాఖ అందిస్తున్న ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని కోరారు.జిల్లాలోని పోలీస్ అధికారులు, కోర్టు విధుల్లో ఉన్న సిబ్బంది రాజీ పడదగిన కేసులను గుర్తించి, ఇరువర్గాలను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహిస్తూ అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. తమ కేసుల్లో రాజీ కావాలనుకునే వారు సమీప పోలీస్ స్టేషన్ లేదా సంబంధిత అధికారులను సంప్రదించాలని సూచించారు. లోక్ అదాలత్ ద్వారా బాధితులకు త్వరితగతిన, తక్కువ ఖర్చుతో న్యాయం లభిస్తుందని ఎస్పీ తెలిపారు.

# ఛత్ పూజ మహోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న చెరుకుపల్లి భరత్ సింహా రెడ్డి



**కుత్బుల్లాపూర్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు.....** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం 132 జీడిమెట్ల డివిజన్ పరిధి అయోధ్య నగర్ లో ఛత్ పూజ మహోత్సవ కార్యక్రమం సందర్భంగా అయోధ్య నగర్ ఛత్ పూజా సేవ సమితి వారి ఆధ్వర్యంలో భక్తి భావంతో జరిగిన ఛత్ పూజా కార్యక్రమం లో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించిన బీజేపీ మేడ్చల్ అర్బన్ జిల్లా కార్యదర్శి చెరుకుపల్లి భరత్ సింహ రెడ్డి. ఈ కార్యక్రమంలో సిద్ధిరాములు, జ్ఞానేశ్వర్, ఉమేష్ సింగ్, ప్రమోద్ సింగ్, అంజయ్య, జాకి, నరేష్, కృపాల్ యాదవ్, రాంబాబు సి×ంగ్, కూన శ్రావణ్ గౌడ్, బాసుపల్లి సందీప్ గౌడ్, మానస్ గౌడ్, అఖిలేష్ సింగ్, గుడ్డు సింగ్, శర్మ జీ, పరక్, గనశాయం, గోరక్ సింగ్ తదితరులు పాల్గొన్నారు.

# ఆచార్యాదా స్కూల్ లో వైభవంగా వార్షికోత్సవ వేడుకలు..

**తల్లిదండ్రులను మైమరిపించే విధంగా చిన్నారుల డ్యాన్సులు...**
**చిన్నారులు దేవలోకంలోని దేవకన్యలా వేషాధారణలతో నృత్యాలు..**
**ఆనందోత్సవాలల్లో మునిగిపోయిన తల్లిదండ్రులు..**
**అంగరంగ వైభవంగా అన్నారం ఆచార్యాదా**







వార్షికోత్సవ వేడుకల్లో చిన్నారులు వేషధారణలతో నృత్యాలు చేయడంతో చిన్నారుల తల్లిదండ్రులు ఆనందోత్సవాలల్లో మునిగిపోయారు గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని శ్రీవివేకానంద స్మార్ట్ కిడ్స్ హై స్కూల్ గుమ్మడిదల, ఆచార్యాది స్కూల్ అన్నారం, పాఠశాలల యాజమాన్యం కరస్పాండెంట్ చిమ్ముల జైపాల్ రెడ్డి, ప్రిన్సిపల్ చిమ్ముల లతా రెడ్డి విద్యాసంస్థల చైర్మన్ చిమ్ముల మల్లారెడ్డి , అనుభవజ్ఞులైనటువంటి అధ్యాపకుల ఆధ్వర్యంలో అంగరంగ వైభవంగా పాఠశాలలను ముస్తాబు చేసి పాఠశాల ప్రాంగణంలో వేదికను ఏర్పాటు చేసి వార్షికోత్సవ ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించారు ముఖ్య అతిథులు వివిధ పార్టీలకు చెందిన ప్రజా ప్రతినిధులు స్థానిక నాయకులు అందరినీ సాదరంగా ఆహ్వానించి వేదికపైకి తీసుకువెళ్లారు వేదికపై చిన్నారులు నిర్వహించినటువంటి నృత్యాలు తిలకిస్తూ ఆనందోత్సవాలల్లో మునిగితేలారు పాఠశాల వార్షికోత్సవ ఉత్సవాలను పురస్కరించుకొని స్థానిక నాయకులు చిన్నారులు బుడిబుడి అడుగులతో చిందులేస్తుంటే అవి చూసి మనసు ఆనందోత్సవాల్లో మునిగిపోయామన్నారు ఈ సందర్భంగా పాఠశాల యాజమాన్యానికి ఇంత మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసి మమ్మల్ని ఆహ్వానించి చిన్నారుల నృత్యాలు తిలకించి ఆనంద ఫార్వన్యం చెందామన్నారు ఇందుకు పాఠశాల యాజమాన్యానికి ధన్యవాదాలు తెలియజేశారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థుల తల్లిదండ్రులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# ఘనంగా స్వర్గీయ కీ.శే.ఆచార్య జయశంకర్ విగ్రహ ఆవిష్కరణ

## ముఖ్యఅతిథిగా కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి





**కుత్బుల్లాపూర్ వాస్తవ తెలంగాణ న్యూస్ ప్రతినిధి దుర్గారావు.....** తెలంగాణ సిద్ధాంతకర్త, ఆరు దశాబ్దాల ఉద్యమ ప్రదాత, అపర మేధావి, తెలంగాణ జాతిపితగా పేరుగాంచిన స్వర్గీయ కీ.శే.ఆచార్య కొత్తపల్లి జయశంకర్ (సార్) జ్ఞాపకార్థంగా ప్రగతి నగర్‌లోని అలీవ్ సర్కిల్‌లో నిర్వహించిన విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా జరిగింది.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన కుత్బుల్లాపూర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జి కొలన్ హన్మంత్ రెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించి, అనంతరం పూలమాల అర్పించి గణ నివాళులు సమర్పించారు ఈ సందర్భంగా హన్మంత్ రెడ్డి మాట్లాడుతూ, ఆచార్య జయశంకర్ తెలంగాణ రాష్ట్ర సాధనలో కీలక పాత్ర పోషించి, తన జీవితాన్ని ప్రజల కోసం అంకితం చేసిన మహానుభావుడని కొనియాడారు. ఆయన చూపిన మార్గంలో నడుచుకుంటూ, తెలంగాణ అభివృద్ధికి కృషి చేయడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.ఈ కార్యక్రమంలో సీనియర్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

# బొంతపల్లి వీరభద్ర స్వామి ఆలయ హుండీ లెక్కింపు



**గుమ్మడిదల,వాస్తవ తెలంగాణ న్యూస్:** సంగారెడ్డి, గుమ్మడిదల మున్సిపల్ పరిధిలోని బొంతపల్లి వీరభద్ర స్వామి దేవస్థాన 118 రోజుల హుండీ ఆదాయము రూ.16,96,418/ (పదహారు లక్షల తొంబది ఆరు వేల నాలుగు వందల పద్దెనిమిది రూపాయలు), అన్నదాన హుండీ ఆదాయము రూ.70,684 / (డెబ్బది వేల ఆరు వందల ఎనబై నాలుగు రూపాయలు) వచ్చినట్లు ఆలయ ఇన్స్పెక్టర్ (నాచారం ఈవో) రంగాచారి తెలిపారు. ఈ లెక్కింపు లో తాజా మాజీ ఆలయ కమిటీ చైర్మన్ మద్ది ప్రతాపరెడ్డి, మాజీ ధర్మకర్తలు భాస్కర్ గౌడ్, యాదగిరి గౌడ్, పూజారి కృష్ణ, పొన్నబోయిన రాజు, ఆశ, మండల శ్రీనివాస్ గౌడ్, అశోక్ గౌడ్ లు కార్యనిర్వహణాధికారి శశిధర్ గుప్తా, మాజీ చైర్మన్ మరియు కౌన్సిలర్లు, కుమార్ గౌడ్, గిద్దే విజయలక్ష్మి, జైపాల్ రెడ్డి, మరియు గ్రామ పెద్దలు ఆలేటి శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మీనారాయణ, హుస్సేన్ సత్యం సేవా సంస్థ, లలితా సేవా సంస్థ, పోలీస్ సిబ్బంది సంతోష్ కుమార్ మరియు అర్చకులు దేవస్థానం సిబ్బంది పాల్గొన్నారు.




## ఇద్దరబ్బాయిలతో..

### స్టార్ హీరోలపై జాన్వీ కన్ను

- ప్రభాస్, అల్లు అర్జున్ వైపు జాన్వీ చూపు
- వారితో నటించేందుకు ప్రణాళికలు
- పాన్ ఇండియా లెవల్‌లో వెళ్లాలని ఆశ

## వీరయ్య.. కాంబో!


### బాబీతో మెగాస్టార్ కొత్త చిత్రం

మెగాస్టార్ చిరంజీవి అభిమానులకు ఆసక్తికరమైన వార్త. 'వాల్తేరు వీరయ్య' వంటి బ్లాక్‌బస్టర్ విజయం తర్వాత చిరంజీవి, డైరెక్టర్ బాబీ కొల్లి కాంబినేషన్ మరోసారి పునరావృతం కానుంది. మెగాస్టార్ కెరీర్‌లో 158వ చిత్రంగా రానున్న ఈ సినిమా షూటింగ్ ఏప్రిల్ రెండో వారం నుంచి ప్రారంభం కానుంది. ఈ నెలాఖరులోగా సినిమాకు సంబంధించిన అధికారిక పూజా కార్యక్రమాలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. తొలి షెడ్యూల్‌లో చిరంజీవిపై కొన్ని సోలో ఎంట్రీ సన్నివేశాలను, ఆ వెంటనే ఓ మాస్ సాంగ్‌ను చిత్రీకరించాలని దర్శకుడు ప్లాన్ చేసినట్లు సమాచారం. ఈ చిత్రాన్ని కేవీఎన్ ప్రొడక్షన్స్ బ్యానర్‌పై వెంకట్ కె నారాయణ, లోహిత్ భారీ బడ్జెట్‌తో నిర్మించనున్నారు.ఇటీవల 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రంతో విజయాన్ని అందుకున్న చిరంజీవిని ఈ సినిమాలో పూర్తిస్థాయి మాస్ అవతార్‌లో చూపించనున్నారు. అయితే కేవలం మాస్ అంశాలకే పరిమితం కాకుండా కుటుంబ భావోద్వేగాలకు కూడా పెద్దపీట వేస్తూ బాబీ ఓ ప్రత్యేకమైన కథను సిద్ధం చేశారని చిత్ర వర్గాలు చెబుతున్నాయి. చిరంజీవిని సరికొత్తగా ప్రజెంట్ చేయాలనే లక్ష్యంతో ఈ ప్రాజెక్ట్‌ను రూపొందిస్తున్నారు. గతంలో వీరిద్దరి కాంబినేషన్‌లో వచ్చిన 'వాల్తేరు వీరయ్య' భారీ విజయం సాధించడంతో ఈ కొత్త ప్రాజెక్ట్‌పై అభిమానుల్లో, ఇండస్ట్రీలోనూ అంచనాలు రెట్టింపయ్యాయి. మాస్, ఎమోషన్ కలగలిపి రానున్న ఈ చిత్రం మెగాస్టార్ కెరీర్‌లో మరో మైలురాయిగా నిలుస్తుందేమో చూడాలి.

## రికార్డుల..ధురంధర్

- పాత రికార్డులకు పాతర
- వెయ్యి కోట్ల క్లబ్‌లోకి ధురంధర్ 2 అడుగులు


బాలీవుడ్ బాక్సాఫీస్ వద్ద సరికొత్త చరిత్ర ఆవిష్కృతమవుతోంది. యువ నటుడు రణవీర్ సింగ్ నటించిన స్పై థ్రిల్లర్ 'ధురంధర్: ది రివెంజ్' వసూళ్ల సునామీ సృష్టిస్తోంది. ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన ఈ చిత్రం, రంజాన్ సెలవులను అందిపుచ్చుకుని కేవలం నాలుగు రోజుల్లోనే ప్రపంచవ్యాప్తంగా రూ. 700 కోట్ల గ్రాస్ మార్కును అధిగమించి ట్రేడ్ వర్గాలను సైతం ఆశ్చర్యపరిచింది.ప్రేక్షకుల నుంచి అద్భుతమైన స్పందన రావడంతో థియేటర్లు కిక్కిరిసిపోతున్నాయి. ముఖ్యంగా రణవీర్ సింగ్ నటన, ఆదిత్య ధర్ మేకింగ్ సినిమాకు ప్రధాన బలంగా నిలిచాయని విశ్లేషకులు చెబుతున్నారు. ఆర్. మాధవన్, సంజయ్ దత్, అర్జున్ రాంపాల్ వంటి భారీ తారాగణం కూడా సినిమా స్థాయిని పెంచింది. ఈ చిత్రం సృష్టిస్తున్న ప్రభంజనం ముందు పాత రికార్డులు కొట్టుకుపోతున్నాయి. 'గదర్ 2', 'జైలర్', 'సలార్' వంటి బ్లాక్‌బస్టర్ చిత్రాల లైఫ్‌టైమ్ కలెక్షన్లను 'ధురంధర్' కేవలం నాలుగు రోజుల్లోనే దాటేయడం విశేషం. ఆదివారం ఒక్కరోజే భారత్‌లో రూ. 114 కోట్లు వసూలు చేయడం దీని జోరుకు నిదర్శనం.తాజా ట్రేడ్ నివేదికల ప్రకారం ఈ చిత్రం సోమవారం కూడా బాక్సాఫీస్ వద్ద తన పట్టు నిలుపుకుంది. ప్రకారం పనిదినాల్లోనూ మంచి ఆక్యుపెన్సీతో నడుస్తుండటంతో, బుధవారానికల్లా రూ. 1000 కోట్ల క్లబ్‌లో చేరడం ఖాయంగా కనిపిస్తోంది. ఇప్పటికే ఈ సినిమా రణవీర్ సింగ్ కెరీర్‌లోనే అత్యధిక వసూళ్లు సాధించిన చిత్రంగా రికార్డు సృష్టించింది. ఇదే ఊపు కొనసాగితే, భారతీయసినిమా చరిత్రలో టాప్5 చిత్రాల సరసన నిలవడం ఖాయమని ట్రేడ్ పండితులు అంచనా వేస్తున్నారు.



## సినిమాలకు.. విరామం!

- ఇకమీదట ప్రజాసేవపైనే దృష్టి
- అధికారికంగా ప్రకటించిన పవర్ స్టార్
- కొత్త సినిమాలకు కమిట్ అవలేదని వెల్లడి

పవర్ స్టార్ ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ తన కొత్త చిత్రాలపై వస్తున్న ఊహాగానాలకు తెరదించారు. ప్రస్తుతం ఆయన ఏ కొత్త సినిమాకు కమిట్ అవ్వలేదని, ఇప్పట్లో కొత్త ప్రాజెక్టులు ప్రారంభించే ఆలోచన లేదని ఆయన బృందం 'పవన్ కల్యాణ్ క్రియేటివ్ వర్క్స్' అధికారికంగా స్పష్టం చేసింది. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. "ప్రస్తుతానికి పవన్ కల్యాణ్ ఏ కొత్త సినిమా కమిట్‌మెంట్లు తీసుకోలేదు. ఆయన కొత్త ప్రాజెక్టులపై వస్తున్న ఊహాగానాలు వాస్తవం కాదు. సరైన సమయంలో ఏ విషయమైనా అధికారికంగా వెల్లడిస్తాం" అని ప్రకటనలో పేర్కొన్నారు. ఇక, 'ఓజీ' చిత్రానికి సీక్వెల్‌గా భావిస్తున్న 'ఓజీ2' అప్‌డేట్‌ను స్వయంగా పవన్ కల్యాణే సరైన సమయంలో తెలియజేస్తారని స్పష్టం చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత కూడా పవన్ కల్యాణ్ సినిమాలు చేస్తుండడం తెలిసిందే. ముఖ్యంగా 'ఉస్తాద్ భగత్ సింగ్' తర్వాత మోహన్ రాజా, దేవ కట్టా వంటి దర్శకులతో చర్చలు జరుపుతున్నారని వార్తలు వచ్చాయి. ఈ నేపథ్యంలోనే వదంతులకు ఫుల్‌స్టాప్ పెట్టేందుకు పవన్ టీమ్ ఈ ప్రకటన విడుదల చేసింది. మొత్తంగా, పవన్ కల్యాణ్ తన పూర్తి దృష్టిని రాజకీయ బాధ్యతలపైనే కేంద్రీకరించినట్లు ఈ ప్రకటనతో స్పష్టమైంది.




Editor, printer, published Owned by CHINTHALA RAMAKRISHNA Gummadidala (M&V) SANGAREDDY DIST TELANGANA State 502313 ph 8499902850/RNI NO:TELTEL/2022/81794